Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు
rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue): 122 పేజీలు (Pages): 8 వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

మంగళవారం, 18 - 11 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం: 2015

## మదీనా రోడ్డు ప్రమాదంపై ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి



**ఢిల్లీ:** మక్కా యాత్రకు వెళ్లిన పలువురు భారతీయ యాత్రికులు మదీనాలో రోడ్డు ప్రమాదానికి గురైన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో పెద్ద సంఖ్యలో యాత్రికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంపై భారత ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం తన ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. 'మదీనా రోడ్డు ప్రమాదంలో భారతీయులు మృత్యువాత పడటం బాధాకరం. ఈ ప్రమాదంలో తమ ప్రియమైన వారిని కోల్పోయిన కుటుంబసభ్యులకు నా ప్రగాఢసానుభూతి. గాయపడ్డ వారు అత్యంత త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను. రియాద్‌లో ఇండియన్ ఎంబసీ, జెడ్డాలోని కాన్సులేట్ సాయం అందిస్తున్నాయి. భారత అధికారులు సౌదీ అధికారులతో ఈ ప్రమాదం గురించి ఎప్పటికప్పుడు చర్చిస్తూ ఉన్నారు' అని అన్నారు. కాగా, సోమవారం తెల్లవారు జామున భారతీయ యాత్రికులు మక్కాలో ప్రార్థనలు ముగించుకుని బస్సులో మదీనా వెళుతూ ఉన్నారు. వారు ప్రయాణిస్తున్న బస్సు 1.30 గంటల ప్రాంతంలో డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొట్టింది. దీంతో బస్సులో మంటలు చెలరేగాయి. పెద్ద సంఖ్యలో యాత్రికులు సజీవ దహనం అయ్యారు. మరికొంత మంది తీవ్రంగా గాయపడ్డారు

## సౌదీలో రోడ్డు ప్రమాదం.. సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి



**అమరావతి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సౌదీ అరేబియాలో చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం తన ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. సౌదీ అరేబియాలో చోటు చేసుకున్న ప్రమాదం చాలా బాధ కలిగించిందని అన్నారు. మృతుల పవిత్ర ఆత్మలకు శాంతి కలగాలని ఆకాంక్షించారు. ఈ విషాదకర సమయంలో బాధిత కుటుంబాలకు ధైర్యం, ఓదార్పు కలగాలని కోరుకుంటున్నానని అన్నారు.

**ప్రధాని మోదీ ట్వీట్..**

ప్రధాని నరేంద్ర మోదీ సౌదీ ప్రమాదంపై తన ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. మదీనా రోడ్డు ప్రమాదంలో భారతీయులు మృత్యువాత పడటం బాధాకరమని అన్నారు. ప్రమాదంలో తమ ప్రియమైన వారిని కోల్పోయిన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గాయపడ్డ వారు అత్యంత త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నానని అన్నారు.

**ప్రమాదం ఎలా జరిగిందంటే..**

ఈ నెల 9వ తేదీన 54 మంది ఇండియానుంచి మక్కా యాత్ర కోసం వెళ్లారు. సోమవారం మక్కాలో ప్రార్థనలు ముగిసిన తర్వాత 46 మంది బస్‌లో మదీనా బయలుదేరారు. బదర్ - మదీనా మధ్య ముఫరహత్ దగ్గర బస్సు - ట్యాంకర్ ఢీకొట్టుకున్నాయి. ప్రమాదం కారణంగా బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. పెద్ద సంఖ్యలో యాత్రికులు కన్నుమూశారు.

## జగన్ హయాంలో హత్యలు చేసి డోర్ డెలివరీ చేశారు: మంత్రి సత్యకుమార్

**విజయవాడ, (రాజధాని వార్తలు):** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ మంత్రి సత్యకుమార్ యాదవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలని పూర్తిగా విస్మరించిందని మండిపడ్డారు. సోమవారం విజయవాడలో మంత్రి సత్యకుమార్ యాదవ్ పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్ హయాంలో హత్యలు చేసి డోర్ డెలివరీ చేశారని సంచలన వ్యాఖ్యలు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎస్సీ, ఎస్టీలకు పెద్దపీట వేసిందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో స్వర్ణాంధ్రప్రదేశ్‌ని వికసిత్ భారత్‌గా ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. ఈనేపథ్యంలోనే రూ. 87 కోట్లని కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. 740 ఏకలవ్య మోడల్ స్కూల్స్ తీసుకువచ్చి గిరిజన విద్యార్థుల విద్యని అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. సోళ్ల బుజ్జిరెడ్డికి



ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా పదవీ ఇవ్వడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. అవగాహన కలిగిన అనుభ వం ఉన్న వాళ్లని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎంపిక చేశారని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

## మరోసారి ఏపీకి ప్రధాని మోదీ.. అసలు విషయమిదే..

**శ్రీ సత్యసాయి జిల్లా, (రాజధాని వార్తలు):** పుట్టపర్తి సత్యసాయి బాబా శత జయంతి వేడుకలను పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఈ వేడుకలకు భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేశ్ హాజరు కానున్నారు. వీవీఐపీల రాక సందర్భంగా ఏపీ పోలీసులు కట్టుదిట్ట మైన ఏర్పాట్లు చేశారు. ఈ నెల 19వ తేదీన ప్రత్యేక విమానంలో పుట్టపర్తి విమానాశ్రయానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేరుకోనున్నారు. ఉదయం 8 గంటలకు విమానాశ్రయానికి ప్రధాని రానున్నారు. విమానాశ్రయంలో ప్రధాని మోదీకి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ ఘన స్వాగతం పలకనున్నారు. అక్కడి నుంచి ప్రధాని ప్రత్యేక కాన్వాయిలో ప్రశాంతి నిలయం చేరుకుంటారు. ప్రశాంతి నిలయం సాయి కుల్వంత్ సభ మందిరంలో జయంత్యుత్సవాల సందర్భంగా సత్యసాయిబాబా మహా సమాధిని మోదీ దర్శించుకుంటారు. అనంతరం హిల్ వ్యూ స్టేడియంలో ఏర్పాటు చేసిన





శతజయంతి వేడుకల్లో పాల్గొని ప్రధాని మోదీ ప్రసంగించనున్నారు. మోదీతో కలిసి చంద్రబాబు, పవన్, నారా లోకేశ్‌తోపాటు జయంత్యుత్సవాల కమిటీ, ఏపీ మంత్రుల బృందం ఈ వేడుకల్లో పాల్గొంటారు. అదేవిధంగా 22వ తేదీన సత్యసాయి యూనివర్సిటీ స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథి హోదాలో భారత రాష్ట్రపతి ద్రౌపదిముర్ము, ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ హాజరవుతారు. బందోబస్తులో భాగంగా 2500 మంది పోలీసు బలగాలను మోహరించింది ప్రభుత్వ యంత్రాంగం.

## ఘోరం.. ఎమ్మెల్యే భార్య డిజిటల్ అరెస్ట్




**కడప, (రాజధాని వార్తలు):** డిజిటల్ అరెస్టు పేరుతో పలువురిని సైబర్ క్రిమినల్స్ ఇటీవల మోసం చేస్తున్నారు. సైబర్ నేరస్తుల బారిన పడి బాధితులు పెద్దమొత్తంలో నష్టపోతున్నారు. తాజాగా తెలుగుదేశం పార్టీ మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ భార్యను సైతం డిజిటల్ అరెస్ట్ చేశారు కేటుగాళ్లు. ఈ మేరకు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు పుట్టా సుధాకర్ యాదవ్. ఎమ్మెల్యే ఫిర్యాదు మేరకు ఏడుగురిని అరెస్ట్ చేశారు కడప జిల్లా సైబర్ క్రైమ్ పోలీసులు. డిజిటల్ అరెస్ట్‌కు పాల్పడిన నిందితుల్లో ఢిల్లీకి చెందిన ఐడీఎఫ్‌సీ బ్యాంక్ మేనేజర్ ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. తమ నుంచి సైబర్ నేరస్తులు రూ. 1.7 కోట్లు మోసం చేశారని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు. మరోవైపు.. డిజిటల్ అరెస్ట్‌పై ప్రముఖ నటుడు అక్కినేని నాగార్జున కూడా స్పందించారు. తమ కుటుంబంలో ఒకరు డిజిటల్ అరెస్ట్‌కు గురయ్యారని తెలిపారు. పోలీసులను ఆశ్రయిస్తే సమస్యను పరిష్కరించారని గుర్తు చేశారు. పైరసీని అరికట్టడంలో పోలీసుల కృషి అభినందనీయమని ప్రశంసించారు. సోమవారం హైదరాబాద్ సీపీ సజ్జనార్‌ని సినీ ప్రముఖులు కలిశారు. ఈ నేపథ్యంలోనే నాగార్జున ఈ వ్యాఖ్యలు చేశారు.

## స్టీల్ ప్లాంట్‌పై అపోహలు సృష్టించే యత్నం.. వైసీపీపై పల్లా సీరియస్




**అమరావతి, (రాజధాని వార్తలు):** సీఎం చంద్రబాబు నాయుడు స్టీల్ ప్లాంట్ కోసం మాట్లాడిన మాటలను వక్రీకరిస్తూ ప్రజలను తప్పు దోవ పట్టించేటట్లుగా ప్రతిపక్షాలు మాట్లాడటం తగదని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు మండిపడ్డారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. స్టీల్ ప్లాంట్ నష్టాల్లో ఉన్నదాన్ని కేంద్రం నుంచి రాష్ట్రం సుమారు రూ. 14 వేల కోట్లు తీసుకొచ్చిందన్నారు. వారికి ఆర్థిక సాయం అందించి ఆదుకుందన్నారు. దాని పట్ల బాధ్యతగా ఉండాల్సింది మాని లేనిపోని రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. బాధ్యతగా తీసుకొచ్చిన డబ్బులను సద్వినియోగం చేసుకోవాలన్న విషయాన్ని పక్కన పెట్టి కార్మికులు ప్లాంట్‌ను ఏదో అన్నారని మాట్లాడడం మంచిది కాదన్నారు. కష్టపడి కేంద్రాన్ని ఒప్పించి రూ. 14 వేల కోట్లల్లో రూ. 11 వేల కోట్లు తీసుకు రావడం జరిగిందని తెలిపారు. రాష్ట్రం నుంచి కూడా సుమారు రూ. 2,600 కోట్లు ఆర్థిక సాయం అందించడం జరిగిం దన్నారు. 30 శాతం పనులు జరుగుతున్న ప్లాంట్‌ను 80 శాతం పనులు జరిగేలా చేశామని చెప్పుకొచ్చారు. పబ్లిక్ సెక్టార్‌లో ఉన్న ఏ ప్లాంట్ అయినా లాభాల్లో నడవాలంటే మేనేజ్‌మెంట్, కార్మికులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. వైసీపీ నాయకులతో కలిసి కొందరు వ్యాఖ్యల్ని వక్రీకరించి మాట్లాడారని మండిపడ్డారు. లేనిపోని అపోహలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబు కృషితోనే ఈ ప్లాంట్ లాభాలబాటలో నడుస్తోందన్నారు. కార్మికులు, ప్రజానీకం, స్టీల్ ప్లాంట్‌లోని వారందరూ గ్రహించాలని అన్నారు. 2000వ సంవత్సరంలో కూడా వాజ్‌పేయి రూ. 1350 కోట్లు తీసుకొచ్చి ప్లాంట్‌ను నిలబెట్టారని గుర్తుచేశారు. రెండోసారి రూ. 1440 కోట్లు తెచ్చి స్టీల్ ప్లాంట్‌ను నడపడం జరిగిందన్నారు. చంద్ర బాబు నాయుడు గురించి చెడుగా మాట్లాడడం మంచిది కాదని అన్నారు. నేడు స్టీల్ ప్లాంట్ నడుస్తోందంటే ఎన్డీయే కూటమి వలననే అన్న విషయం అందరూ గమనించాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు తెలిపారు. అధికారులపై బురద జల్లడం మంచి పద్ధతి కాదన్నారు. కార్మికులు, యాజమాన్యం, ప్రభుత్వం ఎంత బాధ్యతగా ఉందో ప్రతిపక్షానికి కూడా ఆ బాధ్యత ఉండాలని హితవుపలికారు. లేనిపోని అపోహలు సృష్టించడం మంచిది కాదన్నారు. స్టీల్ ప్లాంట్‌ను పరిరక్షించే బాధ్యత ఎన్డీయే ప్రభుత్వంపై ఉందని.. అందులో భాగంగానే కేంద్రాన్ని ఒప్పించి రూ. 11,400 కోట్లు తీసుకు వచ్చామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వానికి బాధ్యత ఉంది కాబట్టే ప్రభుత్వం నుంచి నీరు, విద్యుత్, పన్నులు ఇతరత్రా రూపంలో సుమారు రూ. 2,600 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వడం జరిగిందన్నారు. దేశంలో ఏ పబ్లిక్ సెక్టార్‌కు కూడా రాష్ట్రం పెట్టిన దాఖలాలు లేవని అన్నారు. ఏపీలో కార్మికు లను, నిర్వాసితులను దృష్టిలో పెట్టుకొని విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదాన్ని దృష్టిలో పెట్టుకొని నేడు ఆ ప్లాంట్ కోసం అహర్నిశలు కష్టపడి కేంద్రం నుంచి నిధులు తేవడం జరిగిందని తెలిపారు. కార్మికులను భయాందోళనకు గురిచేయొద్దని అన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించొద్దని.. ఈ ప్రయత్నాలు మానుకోవాలని హెచ్చరించారు. ఎంత వక్రీకరించి మాట్లాడినా ప్రజలు విజ్ఞులు కావున అర్థం చేసుకోగలరన్నారు. ఎన్డీయే కూటమిపై ప్రజలకు అపార నమ్మకం ఉందని స్పష్టం చేశారు. స్టీల్ ప్లాంట్ యాజమాన్యం, కార్మికులే కాకుండా ప్రతిపక్షం కూడా బాధ్యతగా ఉండాలని సూచించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సమిష్టిగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు.

## 10 రోజుల ఎన్ఐఏ కస్టడీకి ఢిల్లీ పేలుడు ఘటన నిందితుడు

**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో ఇటీవల జరిగిన భారీ పేలుడు కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. పేలుడుకు పాల్పడిన ఉమర్‌కు సహకరించిన నిందితుడు అమీర్ రషీద్ అలీని కట్టుదిట్టమైన భద్రత మధ్య పాటియాలా హౌస్ కోర్టు కాంప్లెక్స్‌లోని ప్రిన్సిపల్ డిస్ట్రిక్ అండ్ సెషన్స్ కోర్టు ముందు సోమవారం నాడు హాజరు పరిచారు. ఈ మేరకు 10 రోజుల ఎన్ఐఏ కస్టడీకి కోర్టు ఆదేశించింది. ఆ వెంటనే రషీద్‌ను ఎన్ఐఏ కార్యాలయానికి అధికారులు తరలించారు. అమీర్ రషీద్ అలీని కోర్టుకు హాజరుపరిచే సమయంలో మీడియాను అనుమతించలేదు. కోర్టు కాంప్లెక్స్ చుట్టూ ఢిల్లీ పోలీసులు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బంది మోహరించారు. అల్లర్ల వ్యతిరేక టీమ్‌నూ సిద్ధం చేశారు. నవంబర్ 10న జరిగిన ఢిల్లీ పేలుడు ఘటనలో 10 మంది మృతి చెందగా, 13 మంది గాయపడ్డారు. ఐఈడీ అమర్చి పేల్చిన ఐ20 కారు అమీర్ పేరుతో రిజిస్టర్ కావడంతో ఎన్ఐఏ అతన్ని అదుపులోకి తీసుకుంది. సూసైడ్ బాంబర్ ఉమర్ నబీతో కలిసి ఈ దాడికి అమీర్ రషీద్ కుట్రపన్నినట్టు ఎన్ఐఏ వెల్లడించింది. అమీర్ జమ్మూ కశ్మీర్‌లోని పంపోర్‌కు చెందిన వ్యక్తి కాగా, ఉమర్ ఫరీదాబాద్‌లోని అల్-ఫలాహ్ యూనివర్శిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాడు. తదుపరి విచారణలో భాగంగా ఉమర్ ఉపయోగించిన మరో కారునూ ఎన్ఐఏ స్వాధీనం చేసుకుంది. ఇంతవరకూ గాయ పడిన బాధితులతో సహా 73మంది సాక్ష్యులను ఎన్ఐఏ విచారిం చింది. మరోవైపు, ఫరీదాబాద్ టెర్రర్ మాడ్యూల్ కేసులో ప్రమేయం, మోసం, ఫోర్జరీకి పాల్పడిన ఆరోపణలపై అల్-ఫలాహ్ యూనివ ర్శిటీ చైర్మన్‌కు ఢిల్లీ పోలీసులు రెండు సమన్లు జారీ చేశారు. యూజీసీ, ఎన్ఏఏసీ లేవనెత్తిన ఆందోళనలపై రెండు ఎఫ్ఐఆర్‌లనూ నమోదు చేశారు. యూనివర్శిటీ గుర్తింపు క్లెయిమ్స్‌పై జరిపిన సమీక్షలో పెద్దఎత్తున అవకతవకలు జరిగినట్టు గుర్తించారు.

# వివాహ వేడుకలకు హాజరైన వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** టిడిపి ముఖ్య నేత గూడూరు శ్రీధర్ రెడ్డి, గిరిజా దంపతుల కుమార్తె వినీత రెడ్డి వివాహ వేడుకలకు వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి హాజరయ్యారు. శనివారం నగరం లోని ఎంసీఎస్ కళ్యాణ మండపంలో వైభవంగా జరిగిన ఈ వివాహ మహోత్సవానికి వేమిరెడ్డి హాజరై నూతన వధూవరులను నిండు నూరేళ్లు ఆయురారోగ్య ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆశీర్వదించారు.

ఈ కార్యక్రమంలో టిడిపి ముఖ్య నేతలు పావురాల రమేష్, వంశీధర్ రెడ్డి, కెవిడివి ప్రసాద్ రెడ్డి, ఊటుకూరు చంద్ర, పలువురు టిడిపి నాయకులు పుర ప్రముఖులు పాల్గొన్నారు.

# విక్రమ సింహపురి యూనివర్సిటీ ఎన్.ఎస్.ఎస్ యూనిట్-4 బృందానికి ప్రశంస పత్రాన్ని అందజేసిన వెంకటాచలం ఎం.పీ.డీవో


**నెల్లూరు, (రాజధాని వార్తలు):** వెంకటాచలం మండలం, ఎర్రగుంట గ్రామంలో విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ యూనిట్-4 ఆధ్వర్యంలో ఈనెల 8వ తారీకు నుండి 14 వరకు నిర్వహించిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం విజయ వంతంగా ముగిసింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని వెంక టాచలం మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపిడిఓ) బి. కల్పన ఎన్ఎస్ఎస్ యూనిట్-4కు అభినందన పత్రం అంద జేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా.బి.వెంకట్ సుబ్బా రెడ్డి నాయకత్వంలో వాలంటీర్లు సామాజిక అభివృద్ధి దిశగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. గ్రామ ప్రజలలో ఆరోగ్య అవగాహన, పర్యావరణ పరిరక్షణ, విద్యా చైతన్యం, పరిశుభ్రత కార్యక్రమాలు, సామాజిక సమస్యలపై ప్రచారం వంటి అనేక సేవా కార్యక్రమాలు వాలంటీర్లు సమర్థ వంతంగా నిర్వహించారు. గ్రామ అభివృద్ధి పట్ల ఎన్ఎస్ఎస్ బృందం చూపిన సేవా మనోభావాన్ని అభినందిస్తూ, కమ్యూనిటీ డెవలప్మెంట్ కార్యక్రమాలలో చురుకైన పాత్ర పోషించినందుకు టీమ్ మొత్తానికి ఎంపిడిఓ ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.




ఎన్ఎస్ఎస్ యూనిట్-4 యొక్క ఈ సేవా కార్యక్రమాలు గ్రామ అభివృద్ధికి దోహదపడడంతో పాటు విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందించాయని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు లింగరాజు, గణేష్, దిలీప్, కిరణ్ పాల్గొన్నారు.

# ఆర్ కె బ్యూటీ సెలూన్‌ను ప్రారంభించిన టిడిపి రాష్ట్ర నేత గిరిధర్ రెడ్డి






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని స్థానిక బి వి నగర్ ప్రాంతంలో నిర్వాహకులు అప్రిత రెడ్డి అధునాతన సదుపాయాలతో ఏర్పాటు చేసిన ఆర్ కే బ్యూటీ సెలూన్‌ను నెల్లూరు గ్రామీణ నియోజకవర్గం శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సోదరులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలోని యువతకు అవసరమైన అధునాతన మజిల్ ఎందుకు సదుపాయాలతో కూడిన హెర్బల్ ఫేషియల్, నెయిల్ ఆర్ట్, కెమికల్ ఫీల్స్, పెర్మనెంట్ లిప్స్టిక్, మైక్రో బ్లేడింగ్, పరిమనేంట్ ఐ లైనర్, బ్రైడల్ మేకప్, ఫేషియల్స్, పెడిక్యూర్ అండ్ మనీక్యూర్, హెయిర్ కట్స్ తదితర సేవలను సింహపురి మహిళా యువతకు అందు బాటులోకి హర్షణీయం అన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు




అప్రిత రెడ్డి మాట్లాడుతూ ముఖ్యంగా మహిళలకు కేవలం 999 రూపాయలకే 5 రకాల సేవలు అందిస్తామని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఈ సందర్భంగా కోరారు.

# మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 29వ డివిజన్ మహాత్మా గాంధీ నగర్ నందు "రచ్చబండ" కార్యక్రమం నిర్వహించిన ఆనం విజయకుమార్ రెడ్డి





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** మాజీ ముఖ్యమంత్రి వర్యులు, గౌరవ వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.యస్.జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్ రెడ్డి ఆధ్వ ర్యంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా నెల్లూరు రూరల్ నియోజకవర్గం, 29వ డివిజన్ మహాత్మా గాంధీ నగర్ నందు "రచ్చబండ" కార్యక్రమం నిర్వహించి 'ప్రజా ఉద్యమం' సంతకాల సేకరణ కార్యక్రమం 29వ డివిజన్ నాయకులు మరియు కార్యకర్తలతో కలిసి సేకరించడం జరిగింది. ఈ కార్యక్ర మంలో రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు, నెల్లూరు రూరల్ నియోజకవర్గ అనుబంధ సంఘాల అధ్యక్షులు, డివిజన్ ఇన్చార్జులు, నెల్లూరు రూరల్ నియోజకవర్గ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# దశరథ రామిరెడ్డి నివాసంలో సత్యనారాయణ స్వామి వ్రతం కార్యక్రమానికి హాజరైన పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు మాగుంట లేఔట్ లెక్చరర్స్ కాలనీలో వైసిపి నాయకులు దశరథ రామిరెడ్డి నివాసంలో సత్య నారాయణ స్వామి వ్రతం కార్యక్రమానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్చార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి హాజరై దశరథ రామిరెడ్డి దంపతులకు శుభా కాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు వైసిపి నాయకులు, స్థానిక ప్రజలను చంద్రశేఖర్ రెడ్డి ఆప్యాయంగా పలకరించారు.

# నూతన వధూవరులకు వి బి ఆర్ ఆశీర్వాదం

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** దంపతులుగా ఒక్కటవబోతున్న వధువు సాయి జ్యోతి, వరుడు ప్రవీణ్ చౌదరి లను వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి ఆశీర్వదించారు. శుక్రవారం రాత్రి నగరం లోని శుభం కన్వెన్షన్ సెంటర్లో నెల్లూరు నగర 45 డివిజన్ కన్వీనర్ ప్రసాద్ నాయుడు కుమార్తె సాయి జ్యోతి, ప్రవీణ్ కుమార్ చౌదరి నిశితార్థ వేడుకలకు వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి హాజర య్యారు. ఈ సందర్భంగా వధూవరులను నిండు నూరేళ్లు ఆయురారోగ్య ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు 16వ డివిజన్ కార్పొరేటర్ వేనాటి శ్రీకాంత్ రెడ్డి, టిడిపి, జనసేన ముఖ్య నేతలు, ప్రము ఖులు పాల్గొన్నారు.



# మామిడాల మధుకి మంత్రి నారాయణ ఎలాంటి పదవి అందిస్తారు ..?

**- నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యత ఎవరికి - సర్వత్ర ఆసక్తిగా ఎదురు చూస్తున్న నెల్లూరు సిటీ ప్రజలు**



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణకు మారుపేరు నెల్లూరు నగరంలో మంత్రి నారాయణ కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరినీ పార్టీ తప్పకుండా గుర్తిస్తుందని ఇదివరకే చెప్పారు. అయితే పార్టీ పదవులతో కొందరికి నామినేటెడ్ పదవు లలో తగిన ప్రాధాన్యత కల్పిస్తున్నారు. గత 30 సంవత్సరాలుగా టిడిపికి వీర విధేయుడిగా ఉంటూ మంత్రి నారాయణకు ముఖ్య అనుచరుడిగా పనిచేస్తున్న నెల్లూరు నగర అధ్యక్షులు మామిడాల మధు మంత్రి నారాయణ అడుగుజాడల్లో నడుస్తూ క్షేత్రస్థాయిలో టిడిపి పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తున్నారు. అందరిని కలుపుకుంటూ నిత్యం ప్రజలలో ఉంటూ ప్రజలకు ఏ ఇబ్బం దులు కలిగిన ఇంటి పెద్ద దిక్కును కోల్పోయిన తన యొక్క సొంత నిధులతో ఆర్థిక సహాయం అందించి వారికి ఇంటి బిడ్డల అండగా నిలుస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో పార్టీలోకి రావా లని ఎన్నాల రకాల ప్రలోభాలకు గురిచేసిన టిడిపిని అంటి పెట్టుకొని నిజాయితీగా పని చేస్తున్నారు. మంత్రి నారాయణ సారధ్యంలో నెల్లూరు నగర పురోభివృద్ధికి అహర్నిశలు కృషి చేసిన మామిడాల మధుకు మంత్రి నారాయణ ఎలాంటి పదవిని అందిస్తారన్నది ప్రస్తుతం నెల్లూరు సిటీలో చర్చనియాంశంగా మారింది.

# రాంజీ నగర్ సెంటర్‌లో కోలాహలంగా సాగిన కోటి సంతకాల సేకరణ





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు 16వ డివిజన్, చిల్డ్రన్స్ పార్క్ రోడ్డు రాంజీ నగర్ సెంటర్‌లో డివిజన్ ఇన్ చార్జ్ సగిలి జయరామిరెడ్డి ఆధ్వర్యంలో రచ్చ బండ, కోటి సంతకాల సేకరణ కార్యక్రమాలు ఉత్సాహంగా సాగాయి. ఈ కార్యక్రమానికి వైయ స్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు సిటీ ఇంచార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, నెల్లూరు నగర నియోజకవర్గ పరిశీలకులు చిల్లకూరు సుధీర్ రెడ్డి హాజరై కోటి సంతకాల సేకరణ కార్యక్ర మాన్ని ప్రారంభించారు. కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రజలకు వివరించి ప్రజల వద్ద నుంచి సంతకాలు సేకరించారు. అనంతరం వైసిపి నేతలతో కలిసి ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఆ ప్రాంతంలో పలు దుకాణాలకు వెళ్ళి మెడికల్ కళాశాల లపై కూటమి ప్రభుత్వ కుట్రలను వివరించి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపునిచ్చిన కోటి సంతకాల సేకరణ ఉద్యమాన్ని తెలియ జేసి ప్రజల నుంచి సంతకాలు స్వీకరించారు. ఈ సందర్భంగా పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుం దన్నారు. ప్రజలే నేరుగా వచ్చి జగన్మోహన్ రెడ్డి గ చేస్తున్న కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమానికి.. తమ వంతు మద్దతు ఇస్తూ సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ప్రజా ఆకాంక్షలకు వ్యతిరేకంగా ఈ రాష్ట్రంలో అస్తవ్యస్త పాలన సాగిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈ రాష్ట్రానికి 17 నూతన మెడికల్ కళాశాలలు తీసుకొస్తే చంద్రబాబు నాయుడు వాటిని అమ్మి సొమ్ము చేసుకోవడం దుర్మార్గమన్నారు. ఈరోజు పేదవాడికి, ప్రభుత్వ వైద్యం, వైద్య విద్యను చంద్రబాబు నాయుడు దూరం చేసే కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. ఈరోజు 16వ డివిజన్లో డివిజన్ ఇన్‌చార్జ్ సగిలి జయరామి రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్ర మం ఎంతో చక్కగా నిర్వహించడం సంతోషకరమన్నారు. పార్టీల కతీతంగా ప్రజలు ముందుకు వచ్చి కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమానికి మద్దతు ఇవ్వడం సంతోషకరమన్నారు. నెల్లూరు నగర నియోజకవర్గంలో 60 వేల సంతకాలు సేకరించే దిశగా డివిజన్‌కు 2 వేలు చొప్పున సంతకాలు సేకరిస్తున్నామని తెలిపారు.

రాబోయే రోజుల్లో మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరిం చడాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్ఆర్సిపి మరింత ఉధృతమైన పోరాటం సాగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డౌన్ టౌన్ ఫ్రైడ్ చికెన్ అవుట్ లెట్‌ను సందర్శించి ఆదరించాలి

## -టిడిపి నేత గిరిధర్ రెడ్డి, హెూటల్స్ అసోసియేషన్ ప్రతినిధి అమరావతి కృష్ణారెడ్డి









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని స్థానిక మాగుంట లేఔట్ ప్రాంతంలో నిర్వాహకులు (వ్యాపార భాగస్వాములు) రియాజ్, జగన్‌లు నూతనంగా స్థాపించిన డౌన్ టౌన్ ఫ్రైడ్ చికెన్ అవుట్ లెట్‌ను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, హెూటల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు అమరావతి కృష్ణారెడ్డి శనివారం లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటివరకు నెల్లూరు నగరంలో ఎన్నో హెూటల్స్, బేకరీలు ఉన్నప్పటికీ అధునాతన సదుపాయాలతో, నూతన వెరైటీలతో, సింహపురి ఆహార ప్రియులకు రుచికరమైన ఐటమ్స్‌ను అందించేందుకు డౌన్ టౌన్ ఫ్రైడ్ చికెన్ మూడవ అవుట్ లెట్ మన మాగుంట లేఔట్‌లో స్థాపించడం జరిగిందని నిర్వాహకులు వివరించడం జరిగిందన్నారు. సింహపురి ప్రియులు డౌన్ టౌన్ ఫ్రైడ్ చికెన్ అవుట్ లెట్ రుచులను ఆస్వాదించాలని యాజమాన్య భాగస్వాములు రియాజ్, జగన్ కోరారు.





# టీడీపీలో కార్యకర్తలకే పెద్ద పీట

## - పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం కల్పిస్తాం - నాయకులు, కార్యకర్తలతో మొదటి ఆత్మీయ సమావేశం : కన్వీనర్ చింతల శ్రీనివాసులు







**నెల్లూరు, (రాజధాని వార్తలు):** తెలుగుదేశం పార్టీలో కష్టించి పని చేసే కార్యకర్తలు, నాయకులకు సముచిత స్థానం కల్పిస్తామని సీతారామపురం మండల కన్వీనర్ చింతల శ్రీనివాసులు తెలిపారు. ఇటీవల మండల అధ్యక్షుడుగా ప్రమాణస్వీకారం చేసిన చింతల శ్రీనివాసులు మండలంలోని సీనియర్ నాయకులు, గ్రామ స్థాయి కమిటి నాయకులతో కలిసి శనివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సీతారామపురంలో జరిగిన ఈ కార్యక్రమానికి మండల నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో టీడీపీ శ్రేణులు తరలి వచ్చారు. ఈ సందర్భంగా చింతల శ్రీనివాసులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలపాలనే లక్ష్యంతో మన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అహర్నిశలు శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గాల స్థాయిలో కూటమి నాయకులు, కార్యకర్తలు కలసి సమన్వయంతో ముందుకు వెళ్లాలని, చిన్నచిన్న సమస్యలు ఉంటే చర్చించుకొని పరిష్కరించుకోవాలని సూచించారు. టీడీపీలోనే అన్ని వర్గాల వారికి రాజకీయ చైతన్యం, పదవులు సాధ్యమన్నారు.రాజ్యాంగ పదవుల్లో బీసీలకు పెద్దపీఠ వేసిన పార్టీ టీడీపీనే అన్నారు. కూటమి ప్రభుత్వంలో బలహీన వర్గాలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. మండల స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు ఎక్కడ ఎటువంటి వివాదాలు లేకుండా ప్రతి ఒక్క నాయకుడు కార్యకర్త ప్రతి ఒక్కరు పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఉదయగిరి నియోజకవర్గం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో సీతారాంపురం మండలంలో రానున్న స్థానిక ఎన్నికలలో కూటమి ప్రభుత్వం అన్ని గ్రామాలలో విజయం సాధించే దిశగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. ఎవరికి ఎటువంటి ఇబ్బందులు సమస్యలు ఉన్న ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకుని వస్తే వాటిని పరిష్కరించే దిశగా ఆలోచన చేస్తామని తెలిపారు. ప్రతిపక్ష నేతల ఎత్తుగడలు ఎప్పటికప్పుడు తిప్పి కొట్టాలని సూచించారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రతి గ్రామంలో ఉన్నటువంటి సమస్యలను నాయకులు మండల కన్వీనర్ చింతల శ్రీనివాసులకు తెలుపగా ఆయన ప్రతి ఒక్కరి సమస్యలను విని క్షుణ్ణంగా ఒక పుస్తకంలో రాసుకొని ప్రతి గ్రామంలోని సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సీతారామపురం మండల కన్వీనర్‌గా నూతనంగా ఎన్నికైన చింతల శ్రీనివాసులను పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బొకేలు అందించి, శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ చింతల శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు మేకనబోయిన చిన్న మాలకొండయ్య, ప్రధాన కార్యదర్శి ముత్తూరు సుమన్ బాబు, కార్యదర్శులు తమ్మిశెట్టి వెంకటసుబ్బమ్మ, సయ్యద్ మహబూబ్ బాషా, షేక్ బాబు మరియు మాజీ జెడ్పిటిసి సభ్యురాలు కలవెల జ్యోతి, సీనియర్ నాయకులు జాషువా, జెసి ఇశ్రాయిల్, కల్లూరు జయరామిరెడ్డి, కానాల సిద్దయ్య,తురక వెంకటేశ్వర్లు , పెద్దగౌస్, ఇశ్రాయేల్, పిడతల తిరుపతయ్య, మండల యూత్ కన్వీనర్ పసుపులేటి వికాస్ బాబు, అప్పని శ్రీనివాసులు మరియు అన్ని గ్రామస్థాయి కమిటీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# "ఆనం అరుణమ్మకు కాకాణి పరామర్శ"





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ప్రజాపరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ మాతృమూర్తి కోడూరు సరస్వతమ్మ ఇటీవల మృతి చెందడంతో, బాలాజీ నగర్ లోని ఆమె నివాసానికి వెళ్లి శ్రద్ధాంజలి ఘటించి, ఆనం విజయ కుమార్ రెడ్డి ఆనం అరుణమ్మ దంపతులను, కుటుంబ సభ్యులు కాకాణి విజితమ్మ, పూజితమ్మలతో కలిసి పరామర్శించిన మాజీ మంత్రివర్యులు మరియు ఉమ్మడి నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి.

# నారాయణ రెసిడెన్షియల్ కళాశాలలో ఉచిత మెగా వైద్య శిబిరం





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నారాయణ విద్యాసంస్థల హ్యూమన్ రిసోర్స్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో నారాయణ మెడికల్ కళాశాల, హాస్పిటల్ వారి సౌజన్యంతో నగరంలోని ధన లక్ష్మీపురం నందుగల నారాయణ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల ఆవరణలో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరాన్ని నారాయణ విద్యా సంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి ప్రారంభించి ఉచిత వైద్య సేవలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారాయణ విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు సిబ్బందికి ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తమ వద్ద చదివే విద్యార్థులు, విధులు నిర్వహించే ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రత్యేక శ్రద్ధచూపుతున్నామన్నారు. నేడు ధనలక్ష్మిపురం నారాయణ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరంలో కంటి వైద్య విభాగం దంత వైద్య విభాగం జనరల్ ఫిజీషియన్ తదితర విభాగాలకు చెందిన వైద్య నిపుణులు పాల్గొని, విద్యార్థులకు సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. విద్యార్థులకు ఆరోగ్యం పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించి అవగాహన కల్పించారన్నారు. అలాగే అవసరమైన మందులను ఉచితంగా అందజేయడం జరిగిందన్నారు. డీజీఎం మహేష్, ఏజీఎం బాలకృష్ణా రెడ్డి, డీన్ విజయభాస్కర్ రెడ్డి తదితరులు మాట్లాడుతూ నారాయణ విద్యాసంస్థల వ్యవస్థాపకులు డాక్టర్ పొంగూరు నారాయణ గారి సహకారంతో, జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి సూచనల మేరకు ఉచిత వైద్య శిబిరాన్ని హెచ్ఆర్ విభాగం వారు ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. వైద్యులు ఎంతో చక్కగా విద్యార్థులకు ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ విభాగాలు వైద్య నిపుణులు, ప్రిన్సిపాల్ వాసు బాబు, ఏవో శ్రీనివాసులు రెడ్డి, హెచ్ఆర్ మస్తానయ్య, సుభాష్ అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# తరగతి గదిలలోనే ఉత్తమ ప్రపంచానికి శ్రీకారం : డాక్టర్ కరటూరి




**రాజమండ్రి, (రాజధాని వార్తలు):** స్థానిక దానవాయిపేటలోని ఆక్స్ఫర్డ్ ఒలంపియాడ్ పాఠశాలలో బాలల దినోత్సవం కనుల పండుగ జరిగింది.ఈ కార్యక్రమంలో బాల బాలికలు రైమ్స్ మోరల్ స్టోరీస్ పాట్ పెయింటింగ్స్ మేకింగ్ ఆఫ్ గ్రీటింగ్ మెహేంది ఎల క్యూషన్ కాంపిటీషన్ పలు విభాగాలలో పోటీలు నిర్వహించారు అనేక సాంస్కృతిక కార్యక్రమాలలో ఉత్సాహంగా విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ప్రముఖ వైద్యులు కిఫి హాస్పిటల్ వ్యవస్థాపకులు, ప్రముఖ వక్త, సామాజిక సేవాతత్పరుడు డాక్టర్ కరుటూరి సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థుల ఉద్దేశించి ప్రసంగించారు. భావితరాలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేది ఈ తరగతి గదిలేనని అన్నారు. ప్రపంచంలో ఎలా మనుగడ సాగించాలో ఎలా వ్యవహరించాలో వంటి అనేక విజ్ఞానపరమైన విషయాలను బోధించేది తరగతి గదుల్లోనేనని వివరించారు. విద్యార్థులు చదువుకునే సమయంలో ఎటువంటి అలసత్వం వహించే రాదని సూచించారు. విద్యావంతుల ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందని డాక్టర్ కరుటూరి అభిప్రాయం వ్యక్తం చేశారు. దేశంలో రాజమండ్రి వంటి నగరానికి ప్రత్యేక గుర్తింపు రావడం విద్యారంగం ద్వారానే అన్న విషయం ఎప్పటికీ మరిచి పోలేని అంశంగా ఆయన ప్రస్తావించారు. బాలల దినోత్సవం నిర్వహించుకోవడంలో పాఠశాల యాజ మాన్యం తీసుకున్న ప్రత్యేక శ్రద్ధ అభినందనీయమని ముఖ్యంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఉషా మాధురి చూపిన చొరవను కొనియాడారు. విద్యార్థులు తమ జీవిత గమ్యాలను నిర్దేశించుకుని ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని డాక్టర్ కరుటూరి హితవు పలికారు. వివిధ పోటీ పరీక్షల్లో, సాంస్కృతిక కార్యక్రమాలలో విజేతలైన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు.ఈ కార్యక్ర మంలో ప్రధానోపాధ్యాయురాలు ఉషా మాధురితో పాటు, ఇంచార్జెస్ జ్యోతి కిరణ్, సౌమ్య తదితర ఉపాధ్యాయుని ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. సుమారు ఐదు గంటల పాటు బాలల దినోత్సవ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పేరెంట్స్‌ను విశేషంగా అలరించింది.

# రెవెన్యూ భూవివాదంపై గ్రామసభ



**దక్కలి, (రాజధాని వార్తలు):** దక్కిలి మండలం, వెలికల్లు గ్రామానికి సంబంధించిన సర్వే నం. 322/19లో 0.80 ఎకరాలు, సర్వే నం. 360/15లో 0.52 ఎక రాల భూవివాదంపై రెవెన్యూ గ్రామసభ నిర్వహించినట్లు తహసీల్దార్ ఎం శ్రీనివాసులు తెలిపారు సంబంధిత రైతులు, గ్రామ పెద్దలు, హక్కుదారులు ఈ గ్రామ సభకు హాజయ్యారు. సంబంధిత రైతులు, గ్రామ పెద్దల సమక్షంలో ఈ వ్యవహారం పై విచారణ చేపట్టారు ఈ భూసమస్య రెవిన్యూ కోర్టు ద్వారా ఇరువురు వాదనలు తీసుకొని పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# సంపాదకీయం

## రచయిత పాత్రల రహస్య బంధం

కల్పన కల్పనేజీ వాస్తవం వాస్తవమే. పాత్రలు పాత్రలే; వ్యక్తులు వ్యక్తులే. తెలియందెవరికి? అయితే పాఠకులు, రచయితలు కల్పిత పాత్రల్ని వాస్తవ వ్యక్తులుగా భావించటం ఒక కళారహస్యం. బాల్య కౌమారాల్లో, 'చందమామ' గహన మాంత్రిక గుహల్లో, అడవుల్లో కథానాయకుడే కాదు, ఈ చదివే పిల్లాడూ తిరుగాడే వాడు. అది రసాత్మక దూరం లేకపోవటం. ఆ దూరం లేనప్పుడు చదువరి కథ లోపలి మనిషే అవుతాడు. అలాగే రచయిత కూడా భావనా ప్రపంచంలో తన పాత్రలతో కలిసి తిరుగుతుంటాడు. అతని ఊహాలోక విహారాన్ని బట్టి ఆ తిరుగుడు ఉంటుంది. దాన్ని పుస్తకం మూసేసినట్టు ఆపేసి, వెలుపలికి వచ్చేవాళ్ల హాయి వేరు. అపారమైన కావ్య ప్రపంచంలో కవే బ్రహ్మ అని, అతని అభిరుచికి అనుగుణంగా ఆ ప్రపంచం ప్రవర్తిల్లుతుందని ఆనందవర్ధనుడు అనే ఆలంకారికుడు చెప్పాడు. సాహిత్య సృష్టి అనేది రెండో ప్రపంచం. ఆ ప్రపంచంలో అనేక పాత్రలు పుడతాయి, పెరుగుతాయి, మాట్లాడతాయి, ఏడుస్తాయి, నవ్వుతాయి. అవి రచయిత మనస్సులో పుట్టి, పాఠకుల మనస్సులో నివాసం ఏర్పరచుకుంటాయి. ఇక్కడే Wayne C. Booth (The Rhetoric of Fiction) తెలిపిన విశేషమైన సంగతి చెప్పుకోవాలి. పాత్ర నిర్మాణాన్ని రచయిత, పాఠకుల సహసృష్టిగా అతను భావించాడు. అంటే రచయిత చేసే రూపకల్పనతో పాటు పాఠకుడు ఆ పాత్రల స్వరూప స్వభావాలను తన ఊహలతో, నిర్ధారణలతో కలిపి ఏర్పరుచుకుంటాడన్నమాట. అది రచయిత కల్పనకి కాస్త వేరుగా ఉండవచ్చు. ఒక పాత్ర ప్రవర్తన లేదా మొత్తం వాచకం కూడా రచయితకి పెడగా విభిన్న పాఠకులకి విభిన్నంగా తోచవచ్చు. అంటే పాత్రల భిన్న కోణాలతో పాటు వాటిని గమనించే పాఠకుల దృష్టి కోణం కూడా ఉంటుంది. కథ లేదా నవల రచనా క్రమంలో రచయిత అంతరంగంలో జరిగే రసచర్య బహుశా అందరికీ తెలియకపోవచ్చు. రచయిత పాత్రను సృష్టించటం అంటే అతని మనస్సులో ఒక కొత్త ప్రాణి జన్మించటమే. అతను తన ఆలోచనలతో, అనుభవాలతో, సమాజ పరిశీలనతో పాత్రల్ని రూపొందించి, జీవరేఖ దిద్దుతాడు. ఈ క్రమంలో రచయిత, పాత్రల మధ్య ఒక ఒక ఆత్మీయ సంబంధం నెలకొంటుంది. అవి అతని మనస్సులో సజీవంగా తిరుగాడుతుంటాయి. ప్రపంచంలో మన ఆత్మీయులు కళ్లముందు లేకున్నా మానసిక ప్రపంచంలో ఉంటారు. అది ద్వితీయ వాస్తవికత. అట్లాగే ఈ క్రమంలో రచయిత తన పాత్రతో 'మాట్లాడుతూ' ఉంటాడు. పాత్ర రచయితతో మాట్లాడుతుంది. రచయితకు, అతని పాత్రలకు మధ్య 'సంభాషణ' సాహిత్య సృష్టిలో ఒక మర్మం. ప్రారంభంలో పాత్రలు రచయిత ఆజ్ఞకు లోబడి నడుస్తాయి. కథనం లోతుకు వెళ్లే కొద్దీ, మారే కొద్దీ అవి రచయిత కాదనలేని విధంగా స్వతంత్ర వర్తన కోరుకుంటాయి. రచయిత అనుకున్న ముగింపును పాత్ర కాదనవచ్చు కూడా! అది రచయితకీ సంతోషమే. సృజన క్రమంలో ఈ అన్యోన్యచర్య మానసిక సంక్లిష్ట విశేషం. పాత్రలు, రచయిత ఎదురుబొదురుగా నిలబడే సృజనాత్మక వాదోపవాద సందర్భాలు తెర వెనుక అత్యంత రసవత్తర ఘట్టాలు. కథలో గమ్య గమన సుస్థిర జ్ఞానం గల రచయితలకైతే ఆయా పాత్రల జీవన యాత్ర మొత్తం మనోగతమే. ఎక్కడా అది బెసగదు. మొదటినుంచి చివరదాకా ఆ మనోగతి చొప్పున అవి సాగిపోతాయి. నాబోటి అసంతృప్త రచయిత, యజమాని లాగా ఆ పాత్రని కాసేపు అటు తిరగమంటాడు, అంతలోనే ఇటు మెల్లగా నడవమని, కాదు కాదు, అటు లగెత్తమని, ఇదుగో ఈ మాటలు కాదు, ఆ పలుకులు వల్లించమని నానా తిప్పలు పెడతాడు. చూసి చూసి, 'ఇక చాల్లే సంబడం' అని అది తోచిన నాలుగు ముక్కలు చెప్పేసి, 'వీడ్కోలు' చెప్పి నచ్చిన దారిన వెళ్లిపోతుంది. ఇక సదరు 'యజమాని' హాయిగా పడక్కుర్చీలో జేరగిలబడతాడు! కనుకనే రచనాక్షేత్రంలో కొంత దూరం వెళ్లినాక, పాత్రలు తమ మాట వినటం లేదని, వాటి దారి అవి చూసుకున్నాయనీ రచయితలు అనటం కద్దు. హృదయానుభూతి గాఢత గల రచయితకు, అతని పాత్రలకు మధ్య ఒక మానసిక, భావోద్వేగ సంబంధం ఏర్పడుతుందనుకుంటాను. విశిష్ట పాత్రలు రచయితకు కోల్పోరాని వాస్తవ వ్యక్తులుగా, అంతరంగ స్నేహితులుగా మారతాయి. కనుమోడ్పులో, మెలకువలో అతని పక్కనే ఉంటాయి. వాటి ఊపిరి అతనికి సోకుతుంటుంది. రచన ముగిసినా ఆ బంధం తెగదు. అట్లా పాత్రలతో ఆ ఆత్మీయత చదువరులకూ ఏర్పడుతుంది. వాటిని వాళ్లెప్పటికీ కోల్పోరు. ఇక నైపుణ్యం గల నిర్మమకార రచయితలు సాధారణంగా తమ పాత్రలతో వ్యక్తిగత భావోద్వేగాలను మేళవించరు. కథనం మీద వాటి 'పెత్తనం' ఒప్పుకోరు. అక్కడ వాళ్లకున్న బాధ్యత పాత్రలను ఉన్నవి ఉన్నట్లు చూపించటం మాత్రమే గాని వాటితో కలిసి మెలగటం కాదు. కనుక వాటి ఊపిరి తాకనంత కాస్త ఎడంగా నిలబడతారు. అది దోసతీగ బంధం. అది detached attachment. దీన్నే 'impassibilites (impassivity) అన్నాడు Flaubert. అంటే పాత్రల సంవేదనలతో రచయిత తన భావోద్వేగాలను మేళవించకపోవటం. ఈ 'రసాత్మక' దూరం పాత్రలను మరింత సమంగా చిత్రించేటందుకు సాయపడవచ్చు. కాగా, వృత్తిపర/ వ్యాపార రచయితలకు పాత్రలతో యాంత్రిక సంబంధం తప్ప ఎలాంటి హృదయ సంబంధం ఉండదు. అది total detachment. వాళ్లు పాత్రలకు ఆమడ దూరంలో నిలబడతారు. 'అవసరం' అనుకుంటే వాటిని నయానా భయానా ఏ ఏట్లోనో దూకించగలరు!

# గాంధీనగర్ శాఖా గ్రంథాలయంలో పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర పై వ్యాసరచన పోటీలు







**కాకినాడ, (రాజధాని వార్తలు):** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథా లయ సంస్థ ఆధ్వర్యంలోని కాకినాడ వివేకానంద్ పార్క్‌లోని గాంధీనగర్ శాఖాగ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవముల సందర్భంగా 16 11 2025 ఆదివారం నాడు పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరి గింది. గ్రంథాలయ వారోత్సవములు సందర్భంగా మన రాష్ట్రంలో గ్రంథాలయాల అభివృద్ధికి ఎనలేని సేవలందించిన గ్రంథాలయ ఉద్యమకారులైన స్వర్గీయ గ్రంథాలయ పితామహ అయ్యంకి వెంకటరమణయ్య, పాతూరి నాగభూషణం, గాడిచర్ల హరి సర్వోత్తమరావు తదితర ఉద్యమకారులను స్మరించుకోవడం జరి గింది. ఈ సందర్భంగా గ్రంథాలయ ఉద్యమ కారుల చిత్రపటా లకు మరియు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ సభ్యురాలు స్వర్గీయ డాక్టర్ పి చిరంజీవి కుమారి చిత్రపటాలకు రిటైర్డ్ డిప్యూటీ లైబ్రేరియన్ సలాది సాయి సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలను జూనియర్స్ మరియు సీనియర్స్ విభాగాలలో నిర్వహించడం జరిగింది.

జూనియర్స్ విభాగంలో పుస్తక పఠనం ఆవశ్యకత, సీనియర్స్ విభాగంలో స్వచ్ఛ్ ఆంధ్ర స్వర్ణాంధ్ర అనే అంశాలపై పోటీలను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాఠశాల విద్యార్థులు పాల్గొనడం జరిగింది. ఈ సం దర్భంగా లైబ్రేరియన్ ములంపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు 20.11.2025 గురువారం నాడు గ్రంథాలయ వారోత్సవ ముగింపు సభ సందర్భంగా బహుమతి ప్రధానం జరుగును. ఈ కార్యక్రమంలో సంస్కార భారతి జిల్లా ప్రధాన కార్యదర్శి గునుపూడి సావిత్రి ప్రసాద్, డ్రాయింగ్ ఉపాధ్యాయులు టీ జై రామ్, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

# శ్రీసత్యదేవుని సన్నిధిలో కన్నుల పండుగగా తిరుచ్చి సేవ




**అన్నవరం, (రాజధాని వార్తలు):** కాకినాడ జిల్లా అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి సన్నిధిలో శనివారం మరియు ఏకాదశి సందర్భంగా వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య భక్తుల నామస్మరణం మధ్య ఘనంగా శ్రీ స్వామివారి తిరుచ్చి సేవ నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీ స్వామివారిని వివిధ రకముల సుకుంద భరిత పుష్పములతో అలంకరించిన తిరుచి వాహనంపై స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆశీనులు గావించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తూర్పు రాజగోపురం చుట్టూ ముమ్మారు ప్రదక్షిణ గావించారు. శనివారం మరియు కార్తీక ఏకాదశి కావడంతో వేకువజామునుండి భక్తులు స్వామివారి వ్రతం, దర్శనార్థం అధిక సంఖ్యలో విచ్చేశారు. దర్శన క్యూ లైన్లు వ్రత మండపములు భక్తులతో కిటకిటలాడాయి. ముఖ్యంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు తగు జాగ్రత్తలు తీసుకున్నారు.

దర్శనానంతరం భక్తులకు శ్రీ సత్యదేవ నిత్య అన్న దాన పథకం ద్వారా అన్నప్రసాద వితరణ గావించారు. తిరుచి సేవా కార్యక్రమంలో వేద పండితులు, ఆలయ అర్చకులు, భక్తులు, దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు దంపతులు దేవస్థానం అధికారులు సిబ్బంది పాల్గొన్నారు. మరియు ఆదివారం సెలవు దినాలు కావడంతో కార్తీక మాసం చివర కావడంతో జనాలతో క్యూ లైన్లు కిక్కిరిసిపోయాయి. భక్తులు సుమారుగా 8 వేల వ్రతాలు జరుదుతాయని అనుకుంటున్నారు. భక్తులకు ఏవిధమైన అసౌకర్యం కలగకుండా దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం రామాలయం ఎదురుగా గల రౌండ్ మండపంలో పులిహోర, దద్దోజనం వితరణ గావించారు. పిల్లలకు పాలు పంపిణీ చేశారు.

# సుంకరపాలెం ఆర్&బి రోడ్‌కి శంకుస్థాపన చేసిన యంయల్ఏ దాట్ల సుబ్బరాజు



**కాకినాడ, (రాజధాని వార్తలు):** కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం సుంకరపాలెం పంచాయతీ అర్&బి రోడ్ రెండు నియోజకవర్గాల పరిధిలో సుమారు 3 కోట్ల 65 లక్షల రూపాయలు నిధులు రాష్ట్ర ప్రభుత్వంచే మంజూరు చేయించి ఈరోజు పనులకు శాసనసభ విప్ మరియు ముమ్మిడివరం నియోజకవర్గం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ నాగేశ్వరావు ఆధ్యక్షతన అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ధూళిపూడి వెంకట రమణ (బాబి), టేకుమూడి లక్ష్మణరావు, గుంటముక్కల సూరి బాబు, మోపూరి వెంకటేశ్వరరావు, వుంగరాల వెంకటేశ్వరరావు, బాస్కరరాజు, నాగేశ్వరరావు,ఆశోక్, జక్కల ప్రసాద్, భైరవమూర్తి, సతీష్, రెడ్డినాయుడు, హనుమంతరావు, దొరబాబు, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ పత్రికా దినోత్సవాన్ని పురస్కరించుకుని క్యాపిటల్ న్యూస్ ఎడిటర్ త్రినాధ రావుకి ఘన సత్కారం



**కాకినాడ, (రాజధాని వార్తలు):** పత్రికా దినోత్సవం పురస్కరించుకొని విజయనగరంలో గ్రంథాలయ సంస్థ మరియు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో క్యాపిటల్ న్యూస్ యూట్యూబ్ ఛానల్ ఎడిటర్ సిహెచ్ త్రినాధ రావును ఘనంగా సత్కరించటం జరిగింది. త్రినాధ రావు నిజాన్ని నిర్భయంగా ప్రజా గళాన్ని తమ కలంతో వినిపిస్తున్న పాత్రికేయ మిత్రులకు జాతీయ పత్రికా దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. కాకినాడ జిల్లా జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు మరియు క్యాపిటల్ న్యూస్ కాకినాడ విలేఖరి అయినా అలయన్స్ కొమ్మన తాతారావు మా గురువులు ఎడిటర్ మిత్రులు అయినటువంటి త్రినాధ రావుకి ధన్యవాదములు శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఎన్ఎస్ఎస్ కార్యకలాపాలు విద్యార్థుల్లో సేవాభావాన్ని పెంపొందిస్తాయి




**కాకినాడ, (రాజధాని వార్తలు):** యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, జెఎన్టీయూకే కాకినాడ (యుసిఇకె)లో "Bringing Computational Thinking to Schools" అనే కార్యక్రమం యుసిఇకె సెమినార్ హాల్‌లో ఘనంగా నిర్వహించబడింది. ఎన్ఎస్ఎస్ యూనిట్స్ యుసిఇకె మరియు డి.వి.ఎస్.ఎం. చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా ఈ అవగాహన మరియు ఒరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డి. వి. ఎస్.ఎం. చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు మరియు మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ హరిప్రసాద్ దేవరపల్లి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముఖ్య అతిథి డాక్టర్ హరిప్రసాద్ దేవరపల్లి మాట్లాడుతూ "ఈరోజు ప్రపంచంలో Computational Thinking ఒక ప్రాథమిక నైపుణ్యం. ఇది సమస్యలను పరిష్కరించే శక్తిని పెంచుతుంది. మీరు నేర్చుకున్న అంశాలను పాఠశాల విద్యార్థులతో పంచుకుంటే, వారు చిన్న వయస్సులోనే కొత్త ఆలోచనలతో ముందుకు సాగగలరు," అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ జి.శ్యామ్ కుమార్ మాట్లాడుతూ "ఎన్ఎస్ఎస్ కార్యకలాపాలు విద్యార్థుల్లో సేవా భావాన్ని పెంపొందిస్తాయి. ఇలాంటి ఓరియంటేషన్ ప్రోగ్రామ్లు విద్యార్థులకు కొత్త జ్ఞానం మాత్రమే కాదు, దాన్ని సమాజానికి పంచే అవకాశాన్ని కూడా ఇస్తాయి," అని అన్నారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ జీ. శ్యామ్కుమార్, జేఎన్టీయూకే ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్, కే.రమణాజీ, ఎన్ఎస్ఎస్ యూనిట్–1 ప్రోగ్రామ్ ఆఫీసర్, ఎం.వి.ఎస్.వి. కిరణ్మయి, ఎన్ఎస్ఎస్ యూనిట్–2 ప్రోగ్రామ్ ఆఫీసర్, డాక్టర్ పి.వీరలక్ష్మి, ఎన్ఎస్ఎస్ యూనిట్–3 ప్రోగ్రామ్ ఆఫీసర్‌ల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు Computational thinking పట్ల అవగాహన పెంపొందించుకున్నారు. ఎన్ఎస్ఎస్ కార్యకలాపాల భాగంగా వారు పాఠశాలలకు వెళ్లినప్పుడు ఈ నేర్పును పాఠశాల విద్యార్థులతో పంచుకునేందుకు ఈ ఓరియంటేషన్ ఎంతో ఉపయోగపడుతుంది.

# నాసా పోటీ పరీక్షల్లో శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థుల ప్రతిభకు గుర్తింపు



**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** శ్రీకాళహస్తి పట్టణంలోని శ్రీరామ్ నగర్ కాలనీలో వున్న శ్రీ చైతన్య పాఠశాలలో 6వ తరగతి నుంచి 9 వ తరగతి వరకు గల అన్ని ఓరియంటేషన్ విద్యార్థులకు నేషనల్ ఏరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ (నాసా) సంస్థ వారు నిర్వహించిన పరీక్షలో 21 మంది విద్యార్థులు ఎంపికైయ్యారు. ఈ విద్యార్థులందరికీ నాసా ప్రతినిధులు తరపున పాఠశాల ప్రిన్సిపాల్ చేతుల మీదుగా కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఎ.రూపాదేవి మాట్లాడుతూ నాసా వంటి ప్రపంచస్థాయి సంస్థల నుంచి గుర్తింపు పొందేలా గొప్పగా ఎంపిక అయిన విద్యా ర్థులు ప్రాజెక్టులను తయారు చేయాలని, అవి వారి ప్రతిభకు నిదర్శ నంగా ఎంపిక కావాలని ఆశిస్తున్నామని తెలిపారు. నాసా సంస్థ వారు విద్యార్థులకు కేటాయించిన కిట్లను వారికి అందించడం నాకెంతో సంతోషంగా ఉందని తెలిపారు. అనంతరం ఎ.జి.ఎం సురేష్ మాట్లాడుతూ ఈ గుర్తింపు మరందరో విద్యార్థులకు ప్రేరణగా నిలిచి గొప్ప లక్ష్యాల వైపు నడిపిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీన్ త్రివేణి, ఎస్ – బ్యాచ్ ఇన్చార్జ్ శ్రీహరి మరియు నాసా ఇంచార్జ్ కవిత పాల్గొన్నారు.

# ‘అఖండ 2’ మాస్ సాంగ్.. అంతకుమించి అనేలా..




‘అఖండ 2’ టీమ్ ప్రమోషన్ల జోరు పెంచింది. ఇప్పటికే విడుదలైన “అఖండ తాండవం” పాట డివోషనల్ వైబ్స్‌తో చార్ట్‌బస్టర్‌గా నిలవగా, ఇప్పుడు అభిమానులు అసలైన మాస్ ట్రీట్ కోసం ఎదురుచూస్తున్నారు. ‘అఖండ’లో “జై బాలయ్య” పాట ఏ స్థాయిలో ఊగిపోయేలా చేసిందో తెలిసిందే. ఇప్పుడు ఆ పాటను మించిన డ్యాన్స్ నంబర్ ‘అఖండ 2’లో ఉండబోతోందని ఇండస్ట్రీ వర్గాల్లో గట్టి టాక్ నడుస్తోంది. సినిమా నుంచి రెండో సింగిల్‌గా “జాజికాయ జాజికాయ” పాటను నవంబర్ 18న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ పాట ఔట్‌పుట్ అద్భుతంగా వచ్చిందని, ఈ మధ్య కాలంలో వచ్చిన మాస్ పాటలన్నింటికంటే ఇది హై లెవెల్‌లో ఉండబోతోందని సమాచారం. థమన్ మరోసారి తన మ్యూజిక్‌తో థియేటర్లు దద్దరిల్లేలా స్కెచ్ వేసినట్లు తెలుస్తోంది. ఈ పాటకు సంబంధించిన పోస్టర్ కూడా ఈ అంచనాలను పెంచేసింది. స్టైలిష్ డ్రెస్‌లో బాలకృష్ణ, ఆయన పక్కన హీరోయిన్ సంయుక్త గ్లామరస్ లుక్‌లో కనిపించారు. వీరిద్దరి మధ్య కెమిస్ట్రీ, బాలయ్య మాస్ స్టెప్పులు ఈ పాటకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని అంటున్నారు. “జై బాలయ్య” పాటను మించిన ఊపు ఈ పాటలో ఉంటుందని ఇండస్ట్రీలో టాక్ నడుస్తోంది. బోయపాటి శ్రీను సినిమాల్లో స్పెషల్ మాస్ సాంగ్స్ ఏ రేంజ్‌లో ఉంటాయో తెలిసిందే. ఈసారి కూడా థమన్, బోయపాటి కలిసి ఫ్యాన్స్‌కు ఫుల్ మీల్స్ ఇచ్చేలా ఈ పాటను డిజైన్ చేశారట. “అదిరిపోయే మాస్ నంబర్”గా ప్రచారం జరుగుతున్న ఈ పాట కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

ఈ పాటపై ఉన్న నమ్మకంతోనే మేకర్స్ దీన్ని సింపుల్‌గా యూట్యూబ్‌లో కాకుండా, మాస్ సెంటర్ అయిన వైజాగ్‌లోని జగదాంబ థియేటర్‌లో గ్రాండ్ ఈవెంట్‌గా లాంచ్ చేస్తున్నారు. నవంబర్ 18న సాయంత్రం 5 గంటల నుంచి ఈ పాట వైరల్ అవుతుందని చెప్పవచ్చు. “తాండవం” పాటతో అఘోరా విశ్వరూపం చూపించిన టీమ్, ఇప్పుడు “జాజి కాయ”తో బాలయ్యలోని మాస్ ఎనర్జీని చూపించబోతోంది. డిసెంబర్ 5న రిలీజ్ కానున్న ఈ సినిమాకు, ఈ పాట మరో పెద్ద హైలైట్‌గా నిలవడం ఖాయంగా కనిపిస్తోంది.

# ఘట్టమనేని అబ్బాయి.. రవీనా టాండన్ అమ్మాయి




‘ఆర్ఎక్స్ 100’, ‘మహాసముద్రం’ లాంటి ఇంటెన్స్, రా సినిమాలు తీయడంలో దర్శకుడు అజయ్ భూపతిది ప్రత్యేక శైలి. ఆయన ఇప్పుడు తన నాలుగో సినిమా ఏబీ4 కోసం ప్లాన్ సిద్ధం చేశారు. ఈ ప్రాజెక్ట్ కొద్ది వారాల క్రితమే ప్రకటించినా, అసలు సస్పెన్స్ మాత్రం హీరో, హీరోయిన్ల గురించే నడిచింది. ఇప్పుడు ఆ సస్పెన్స్‌కు తెరదించుతూ, టాలీవుడ్‌లోకి అడుగుపెడుతున్న ఇద్దరు క్రేజీ స్టార్ కిడ్స్‌ను మేకర్స్ అధికారికంగా పరిచయం చేశారు. ఈ సినిమాలో హీరోయిన్‌గా నేషనల్ సెన్సేషన్ రషా థడానీని స్వాగతిస్తూ మేకర్స్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈమె 90ల నాటి స్టార్ హీరోయిన్ రవీనా టాండన్, ప్రముఖ నార్త్ ఇండియన్ డిస్ట్రిబ్యూటర్ అనిల్ థడానీల కుమార్తె. ఇప్పటికే ‘ఆజాద్’ అనే హిందీ చిత్రంతో ఎంట్రీ ఇచ్చిన రషా, ఉయ్ అమ్మా పాటతో సోషల్ మీడియాను షేక్ చేసింది. విడుదల చేసిన పోస్టర్‌లో రషా ఒక బైక్‌పై చాలా స్టైలిష్, రగ్డ్ లుక్‌లో కనిపించడం సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఇక ఈ సినిమాతో తెలుగు తెరకు పరిచయం అవుతున్న హీరోది కూడా ఇండస్ట్రీలో చాలా పెద్ద బ్యాక్‌గ్రౌండ్. సూపర్ స్టార్ కృష్ణ గారి మనవడు, దివంగత రమేష్ బాబు గారి కుమారుడు అయిన జయ కృష్ణ ఘట్టమనేని ఈ సినిమాతో హీరోగా అరంగేట్రం చేస్తున్నాడు. ఇలా ఘట్టమనేని మూడో తరం వారసుడు, రవీనా టాండన్ కూతురు కలిసి నటిస్తుండటం ఈ ప్రాజెక్ట్‌కు అతిపెద్ద హైలైట్‌గా నిలిచింది.

దర్శకుడు అజయ్ భూపతి ఈ చిత్రాన్ని తన మార్క్ స్టైల్‌లో ప్లాన్ చేశారు. ఇది ఒక ఇంటెన్స్ లవ్ స్టోరి అని కొండల నడుమ చాలా సహజంగా సాగుతుందని చిత్ర బృందం తెలిపింది. ముఖ్యంగా, తన సినిమాల్లో హీరోయిన్ పాత్రలను చాలా బలంగా రాసుకునే అజయ్ భూపతి, ఈ సినిమాలో కూడా రషా థడానీ కోసం ఒక పవర్‌ఫుల్, ఇంటెన్స్ రోల్‌ను సిద్ధం చేశారని సమాచారం. ఈ భారీ డెబ్యూ ప్రాజెక్ట్‌కు టాలీవుడ్‌లోని ఇద్దరు దిగ్గజ నిర్మాతల అండ దొరికింది. లెజెండరీ ప్రొడ్యూసర్ సి. అశ్విని దత్ (వైజయంతీ మూవీస్) ఈ చిత్రాన్ని సమర్పిస్తుండగా, ‘చందమామ కథలు’ బ్యానర్‌పై పి.కిరణ్ నిర్మిస్తున్నారు. ఈ కాంబినేషన్ చూస్తుంటే, ఇది డెబ్యూ సినిమా అయినా నిర్మాణ విలువలు ఏమాత్రం తగ్గకుండా భారీగా ఉండనున్నాయి. ఈ కొత్తతరం ప్రేమకథ రెగ్యులర్ షూటింగ్ ఈ నెలలోనే ప్రారంభం కానుంది. సినిమా అసలు టైటిల్‌ను, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను మేకర్స్ త్వరలోనే అధికారికంగా వెల్లడించనున్నారు. ఇక స్టార్ కిడ్స్, స్టార్ డైరెక్టర్, స్టార్ ప్రొడ్యూసర్స్ కలయికలో వస్తున్న ఈ సినిమా రాబోయే అప్డేట్స్ తో ఎలాంటి హైప్‌ని క్రియేట్ చేస్తుందో చూడాలి.

# ఆంధ్ర కింగ్ తాలూకా.. రామ్ కాన్ఫిడెన్స్ ఏ లెవెల్లో ఉందంటే..



‘ఇస్మార్ట్ శంకర్’ తర్వాత రామ్ పోతినేని నుంచి వస్తున్న ప్రతీ సినిమాపై అంచనాలు భారీగానే పెరుగుతున్నాయి. ఎందుకంటే అతను ప్రతీ సినిమాతో కొత్త తరహా ఎంటర్టైన్మెంట్ ప్లాన్ చేస్తున్నాడు. అందుకే ఈసారి ఆంధ్రా కింగ్ తాలుకా సినిమాపై కూడా పాజిటివ్ వైబ్స్ క్రియేట్ అవుతున్నాయి. బడా హిట్స్ అందించిన మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌లో సినిమా కావడంతో, ‘ఆంధ్ర కింగ్ తాలూకా’పై ట్రేడ్ వర్గాల్లో సైతం గట్టి బజ్ నడుస్తోంది. ఇది రొటీన్ మసాలా సినిమా కాదు, “బయోపిక్ ఆఫ్ ఎ ఫ్యాన్” (ఒక అభిమాని బయోపిక్) అనే కొత్త కాన్సెప్ట్‌తో ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఇక ఈ సినిమా ఔట్‌పుట్‌పై హీరో రామ్, నిర్మాతలు ఎంత నమ్మకంతో ఉన్నారంటే, ముందుగా ప్రకటించిన నవంబర్ 28కి బదులుగా, ఒక రోజు ముందే.. అంటే నవంబర్ 27నే సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నారు. ఇప్పటికే రామ్ ఫైనల్ కాపీ చూసుకున్నాడట. ఎక్కడ బోర్ కొట్టకుండా పర్ఫెక్ట్ టైమింగ్‌లో సినిమా కొనసాగుతుందట. ఇక ఈసారి హిట్టు గ్యారెంటి అనే నమ్మకంతో రామ్ ఉన్నట్లు ఇండస్ట్రీలో టాక్ నడుస్తోంది. కాన్ఫిడెంట్ వచ్చాకనే అనుకున్న డేట్ కంటే ముందుగానే సినిమాను రిలీజ్ చేయాలని డిసైడ్ అయ్యారట. ఈ నమ్మకానికి తగ్గట్టే, వివేక్ మెర్విన్ అందించిన పాటలు కూడా ఇప్పటికే చార్ట్‌బస్టర్లుగా నిలిచాయి. రామ్, మైత్రీ సంస్థల ఇంతటి నమ్మకానికి అసలు కారణం దర్శకుడు మహేష్ బాబు పి అని ఇండస్ట్రీలో టాక్ నడుస్తోంది. ఆయన రాసుకున్న ఈ అభిమాని బయోపిక్ కథ, భారతీయ సినిమాలో మునుపెన్నడూ చూడని విధంగా చాలా కొత్తగా ఉందట. దర్శకుడు మహేష్ బాబు ఈ యూనిక్ పాయింట్‌ను అద్భుతంగా డీల్ చేశారని, అందుకే రామ్ ఈ ప్రాజెక్ట్‌ను అంతగా నమ్మాడని తెలుస్తోంది. ఈ సినిమా కేవలం రామ్ ఇమేజ్‌పైనే కాకుండా, కథనంపై బలంగా ఆధారపడి ఉంటుందని సమాచారం. “ప్రేక్షకులు ఈ సినిమాలో తమను తాము చూసుకుంటారు” అని మైత్రీ మూవీ మేకర్స్ చెబుతుండటం సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఈ వినూత్న కథకు కన్నడ స్టార్ ఉపేంద్ర లాంటి పవర్‌ఫుల్ యాక్టర్ కీలక పాత్రలో నటించడం సినిమా స్థాయిని మరో మెట్టు ఎక్కించింది. సాంకేతికంగా కూడా ఈ సినిమాకు టాప్ టీమ్ పనిచేసింది. నేషనల్ అవార్డ్ విన్నింగ్ ఎడిటర్ శ్రీకర్ ప్రసాద్ దీనికి ఎడిటర్‌గా పనిచేస్తుండగా, సిద్ధార్థ నూని సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. ఇప్పటికే పాటలతో హైప్ తెచ్చిన టీమ్, నవంబర్ 18న కర్నూలులో భారీ ఎత్తున పబ్లిక్ ఈవెంట్ నిర్వహించి ట్రైలర్‌ను లాంచ్ చేయడానికి సిద్ధమవుతోంది. ఏదేమైనా సరికొత్త కాన్సెప్ట్‌లో నెవ్వర్ బిఫోర్ అనే కాంబినేషన్‌లో వస్తున్న ఆంధ్రా కింగ్ తాలుకా మంచి హైప్ క్రియేట్ చేసుకుంటోంది. ఇక నవంబర్ 27న రాబోతున్న ఈ సినిమా, ప్రేక్షకులకు ఎలాంటి కొత్త అనుభూతిని ఇస్తుందో చూడాలి.

# ఫోటో దిగితే పెళ్లి చేసేస్తారా? పెళ్లి రూమర్లపై త్రిష అసహనం



హీరోయిన్ త్రిష కృష్ణన్ కు ఉన్న క్రేజ్ గురించి కొత్తగా చెప్పనక్కర్లేదు. దాదాపు 20 ఏళ్లుగా సినీ ఇండస్ట్రీలో ఉన్న త్రిష ఇప్పటికీ యంగ్ హీరోయిన్లతో సమానంగా పోటీ పడి, విభిన్న పాత్రలతో ఆడియన్స్‌ను అలరిస్తూ వస్తున్నారు. తెలుగు, తమిళ భాషల్లో ఇప్పటికీ బ్యాక్ టు బ్యాక్ సినిమాల్లో నటిస్తున్న త్రిష నాలుగు పదుల వయసు దాటినా ఇంకా పెళ్లి చేసుకోలేదు. త్రిష పెళ్లిపై కొన్నాళ్లుగా రూమర్లు త్రిష ఇప్పటికీ పెళ్లి చేసుకోకపోవడంతో ఎప్పటికప్పుడు ఆమె పెళ్లి గురించి సోషల్ మీడియాలో వార్తలొస్తూనే ఉంటుండగా, ఈ మధ్య ఆ వార్తలు మరీ ఎక్కువయ్యాయి. త్రిష ఓ స్టార్ హీరోతో ప్రేమలో ఉందని, త్వరలోనే అతన్ని పెళ్లి చేసుకోబోతుందని అంతేకాకుండా త్రిష రాజకీయాల్లోకి కూడా వస్తుందని వార్తలొస్తున్న నేపథ్యంలో ఈ వార్తలపై త్రిష రియాక్ట్ అయ్యారు. తన పెళ్లి, రాజకీయ అరంగేట్రం గురించి వస్తున్న వార్తల్లో ఏ మాత్రం నిజం లేదని త్రిష క్లారిటీ ఇచ్చారు. ఫ్రెండ్స్‌తో దిగిన ఫోటోలను వేరేలా భావించి, దానికి అవాస్తవ కథనాలను జోడించి ప్రచారం చేస్తున్నారని, నేను ఎవరితో ఫోటో దిగితే వారితో పెళ్లి జరిగినట్టేనా? ఇంకా ఎంతమందితో నా పెళ్లి చేస్తారంటూ అసహనం వ్యక్తం చేసిన త్రిష, ఇలాంటి వార్తలు చూసి తనకు అసహ్యమేస్తుందని, ఆధారాలు లేని వార్తల ప్రచారాన్ని వెంటనే ఆపాలని త్రిష హెచ్చరించారు. పెళ్లి వార్తలపై స్వయంగా త్రిష క్లారిటీ ఇవ్వడంతో ఇప్పటికైనా ఈ రూమర్లు ఆగుతాయేమో చూడాలి.

ఇక అమ్మడి కెరీర్ విషయానికొస్తే త్రిష చాలా కాలం తర్వాత తెలుగు సినిమాలోకి రీఎంట్రీ ఇస్తు న్నారు. మెగాస్టార్ చిరంజీవి హీరోగా యంగ్ డైరెక్టర్ వశిష్ట దర్శకత్వంలో తెరకెక్కుతున్న విశ్వంభర మూవీలో త్రిష హీరోయిన్‌గా నటిస్తున్నారు. సుమారు రూ.150 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సోషియో ఫాంటసీ మూవీ వచ్చే ఏడాది సమ్మర్‌లో ప్రేక్షకుల ముందుకు రానుంది.

# పంపుడ్ హైడ్రో స్టోరేజ్ పవర్ ప్లాంట్ ఏర్పాటుపై మంత్రివర్గ నిర్ణయం వెనక్కు తీసుకోవాలి





**మక్కువ, (రాజధాని వార్తలు):** మక్కువ మండలం దుగ్గేరు గ్రామంలో శనివారం నాడు దుగ్గేరు సంత బయలు గల మార్కెట్ షెడ్డు వద్ద మూల వలస మెండంగి కొంజపాక ఎర్ర సామంత వలస ఊటగడ్డ బొడ్డు సామంత వలస కే పెద్దవలస మార్ కొండ పుట్టి సిబిల్లి పెద్దవలస ఇటుక వలస బేలగండ గ్రామాల ప్రజలు గ్రామ పెద్దలు పాల్గొని పంపుడ్ హైడ్రో స్టోరేజ్ పవర్ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ పోరాట కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. పోరాట కమిటీ కన్వీనర్‌గా రాయల సుందర్ రావు, కో కన్వీనర్లుగా పీడిక అసిరి, ఉయ్యక ముత్యాలు, మగ్రి చెంచు, అలాగే పోరాటం సభ్యులుగా మరో 32 మంది తో కమిటీని ఏర్పాటు చేసుకున్నారు.
ఈ సందర్భంగా కన్వీనర్ రాయల సుందర్రావు మాట్లాడుతూ ఈ ప్రాంత గిరిజనులకు రైతులకు నష్టం కలిగించే విధంగా దుగ్గేరు పంపుడు హైడ్రో పవర్ ప్రాజెక్ట్ మంత్రివర్గనిర్ణయాన్ని వెంటనే వెనక్కు తీసుకోవాలని ప్రభుత్వం వచ్చిన జీవో 84 వెంటనే రద్దు చేయాలని అలాగే ఈ ప్రాంతంలో గల సురా పాడు మినీ రిజర్వాయర్ పూర్తి చేసి గిరిజన రైతులకు మేలు చెయ్యాలి కానీ ప్రభుత్వం గిరిజన రైతుల భూములకు నష్టం వాటిల్ల విధంగా ఇటువంటి నిర్ణయాలు తీసుకుంటే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది.
ఈ సభలో క్రియాశీలక సభ్యులు రైతు కూలీ రాష్ట్ర సంఘం కార్యదర్శి దంతులూరి వర్మ మాట్లాడు తూ ఈ ప్రాంతంలో 2000 మెగావాట్ల పంపుడు స్టోరేజ్ పవర్ ప్లాంట్ వల్ల దాదాపు 1000 నుండి 1500 ఎకరాల భూమిని గిరిజనులు కోల్పోవాల్సి వస్తుందని. ఐకమత్యంగా మనమంతా పోరాడితేనే మన హక్కులను కాపాడుకోవచ్చు అలాగే ప్రైవేట్ సంస్థలకు మేలు జరిగే విధంగా ఇటువంటి నిర్ణయాలు తీసుకుం టున్న మంత్రి వర్గానికి గుణపాఠం చెప్పాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.
ఇకనైనా ప్రభుత్వం దిగివచ్చి జీవో నెం బర్ 84 రద్దు చేయకుంటే ప్రభుత్వ నిర్ణయాలకు గిరిజనుల రైతులను ప్రజలను కలసికట్టుగా ఏకతాటిపై తీసుకుని వచ్చి తీవ్రమైన ఆందోళనలో చేపడతామని హెచ్చరించారు.
ఈ కార్యక్ర మంలో ప్రజలు హైడ్రో స్టోరేజ్ పవర్ ప్రాజెక్ట్ పోరాట కమిటీ సభ్యులు మరియు గిరిజన గ్రామాలను వచ్చిన మహిళలు పాల్గొన్నారు.

# ప్రతి కుటుంబానికి 100 రోజులు పని కల్పించాలి

## - వచ్చే వారానికి పురోగతి కనపడాలి

## - టెలికాన్ఫెరెన్సులో అదేశించిన కలెక్టర్ ఎస్.రామ సుందర్ రెడ్డి



**విజయనగరం, (రాజధాని వార్తలు):** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనులు డైలీ లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. అలాగే ప్రతి కుటుంబానికి 100 రోజుల పనులు కల్పన కూడా శత శాతం జరగాలన్నారు. శనివారం ఉపాధి పనులపై టెలికాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ పథక సంచాలకులు డ్వామా, ఏ.పి.డి లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు ఏ.పి.ఓలతో మండల వారీగా కనీస వేతనాలు, పనిదినాలు, తదితర పనులపై సమీక్షించారు. పని దినాల కల్పనలో వెనుక బడితే మండలాధికారుల పై చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ప్రతి మండలంలో కనీసం 1000 మంది ఉపాధి శ్రామికులకు పని కల్పించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో సరాసరి వేతనం రూ. 300/- గా నిర్దేశించినప్పటికీ, అన్ని మండలాల్లో 300 అందడం లేదని, వచ్చే వారానికి ప్రతి మండలంలో 300 పై బడి అందేలా చూడాలని తెలిపారు. వాతావరణం అనుకూలంగా ఉన్నందున, ఎక్కువ మంది శ్రామికులను పనులకు హాజరయ్యేలా చేసి సరాసరి వేతనం పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో మంజూరైన ఫారం పాండ్స్, కంపోస్ట్ పిట్స్, రింగ్ ట్రెంచెస్, ఫిష్ పాండ్స్ వంటి 4 రకాల పనులకు శ్రామికులను అవగాహన పరిచి, ఎక్కువ మందిని హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫారం పాండ్స్ ప్లస్ అనే కొత్త సౌలభ్యాన్ని బండ్లపై పండ్ల మొక్కల పెంపకం ద్వారా లబ్ధిదారులకు ప్రయోజనం చేకూర్చవచ్చని సూచించారు. మంజూరైన పశువుల శాలలు అన్నింటిని గ్రౌండ్ చేయాలన్నారు.

# పరిశుభ్రతపై పిల్లలే పెద్దలకు అవగాహన కలిగించాలి

## - స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రా కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఎస్.రాం సుందర్ రెడ్డి





**విజయనగరం, (రాజధాని వార్తలు):** పరిశుభ్రతపై విద్యార్థులే వారి కుటుంబ సభ్యులకు అవగాహన కలిగించాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాం సుందర్ రెడ్డి తెలిపారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రా లో భాగంగా వ్యక్తిగత పరిశుభ్రత-సామాజిక పరిశుభ్రత పై శనివారం బాబామెట్టలో బాలికల ఉన్నత పాఠశాలలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఒక వ్యక్తి పరిశుభ్రంగా ఉంటే వారి కుటుంబం పరిశుభ్రంగా ఉంటుందని, తద్వారా సమాజమంతా పరిశుభ్రంగా, ఆరోగ్యంగా ఉంటుందని పేర్కొన్నారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ పడేయడం వలన దోమలు, ఈగలు పెరిగి వ్యాధులు కలిగిస్తాయని, తడి, పొడి చెత్తలను వేరు చేసి డస్ట్ బిన్స్‌లో వేయాలని తెలిపారు. వీధులు పరిశుభ్రంగా ఉండేలా చూడడం ప్రతి ఒక్కరి బాధ్యతని, ఈ విషయంలో సామూహికంగా కృషి చేయాలన్నారు. వీధులు, మన పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే వాతావరణం, గాలి కూడా పరిశుభ్రంగా ఉంటాయని అన్నారు. పిల్లలు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని, టాయిలెట్ కి వెళ్ళిన




తర్వాత చేతులు సబ్బుతో కడుక్కోవాలి, తినే ఆహారం కూడా పరిశుభ్రంగా ఉండాలని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖాధికారి మాణిక్యం నాయుడు, ఎం.ఈ.ఓ సత్యవతి, మున్సిపల్ అదనపు కమీషనర్, హెల్త్ ఆఫీసర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా భగవాన్ బిర్సా ముండ జయంతి



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** భగవాన్ బిర్సా ముండా జయంతి శనివారం స్థానిక బిజెపి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బిర్సా ముండా జార్ఖండ్ నగరంలో గిరిజనుల కోసం చేసిన పోరాటాలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఎం.భాస్కరరావు, దొగ్గ దేవుడు బాబు, జిల్లా ఉపాధ్యక్షులు ఆరిశెట్టి ఏడుకొండలు, ప్రధాన కార్యదర్శికే తవుడు, నల్లి ఆదినారాయణ, తవిటి నాయుడు, గోపి పాల్గొన్నారు.

# రైతులకు యూరియా పంపిణీ చేసిన టీడీపీ సీనియర్ నాయకులు గాలి మురళి నాయుడు

**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** శ్రీకాళహస్తి నియోజక వర్గంలోని తొట్టంబేడు మండలంలో వున్న ఇలగనూరు పంచాయతీ, కనపర్తి మార్గంలోని అన్ని గ్రామాల రైతులకు యూరియాను, సచివాలయంలో ఒక ఎకరాకు మొదటి విడత మూడు బస్తాల చొప్పున సిఎం నారా చంద్రబాబునాయుడు కూటమి ప్రభుత్వం ఆదేశాల మేరకు శ్రీకాళహస్తిని యోజకవర్గ ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుదీర్ రెడ్డి సూచనల మేరకు రైతులకు యూరియాను మాజీ మండల టిడిపి అధ్యక్షులు గాలి మురళీ నాయుడు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయంలో కార్డుల పంపిణీ ఆన్లైన్లో నమోదు కార్యక్రమం ఆలస్యం కావడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని దానిని ప్రభుత్వం గుర్తించి త్వరితగతిన రైతులకు సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కాలయాపన చేయ కుండా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలని మురళి నాయుడు అగ్రికల్చర్ అధికారులను, సచివాలయ సిబ్బందిని కోరారు. వారు స్పందించి ఆన్లైన్ సమస్య ఉన్నందున ఇబ్బందికరంగా ఉందని తెలియజేశారు. ప్రభుత్వం రైతులకు అంచలంచెలుగా యూరియా కొరత లేకుండా రైతులను ఆదుకుంటారని భరోసా కల్పించారు.
ఈ కార్యక్రమంలో టిడిపి నాయ కులు రాంబాబు నాయుడు, వట్టికుండల మునిరత్నం నాయుడు, తెలుగు యువత నాయకులు మద్దినేని సురేష్ నాయుడు, అంకయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# గర్ల్స్ హైస్కూల్లో స్వర్ణాంధ్ర.. స్వచ్ఛఆంధ్ర



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర.. స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులందరినీ వలయ ఆకారంలో నిలబెట్టి మధ్యలో "సాసా" ఆకృతిలో కూర్చొనిపెట్టారు. అనంతరం స్వచ్ఛ్ ఆంధ్ర.. స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ సామూహికంగా చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీపీ బెల్లాన జ్ఞాన దీపిక మాట్లాడుతూ, పరిసరాల పరిశుభ్రతతోనే ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇన్స్పెక్టర్ కే.కిరణ్ కుమార్ నాయుడు, ఎం.ఈ.ఓ ఎస్. విమలమ్మ, ఏవో పుష్పలత, ఐసిడిఎస్ పిఓ సూపర్వైజర్ శకుంతల, ప్రధానోపాధ్యాయులు సి.హెచ్. రమేష్ కుమార్, ఎస్ఎంసి చైర్మన్ లెంక స్వామి నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పోస్ట్ ఆఫీసులో "డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్" సేవలు

## - పోస్టల్ ఇన్స్పెక్టర్ ఉపేంద్ర

**గజపతినగరం, (రాజధాని వార్తలు):** పోస్ట్‌ఆఫీస్‌లోనే పెన్షనర్లు సులభంగా డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్‌ను చేయించుకోవచ్చునని సబ్ డివిజన్ పోస్టల్ ఇన్స్పెక్టర్ ఉపేంద్ర అన్నారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ "పెన్షనర్లు ఆధార్ కార్డు, మొబైల్ నంబర్, పి.పి.ఓ వివరములు ఇచ్చి బయోమెట్రిక్/ ఫేస్ స్కాన్ ద్వారా 70 రూపాయలు చెల్లించి సులభంగా డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ పొందవచ్చునని తెలిపారు. సబ్ డివిజన్ పరిధిలోని అన్ని పోస్ట్ ఆఫీసులలో ఈ సేవలు అందుతాయని, దీనిని పెన్షనర్లు సద్వినియోగం చేసుకోవాలని ఉపేంద్ర కోరారు. డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్‌కు సంబంధించి మరిన్ని వివరాల కోసం మొబైల్ నెంబర్ 9959990320 ను సంప్రదించాలని ఆయన కోరారు.



# పీఎం ఆవాస్ యోజన సర్వేలో గోప్యత దేనికి



**మక్కువ, (రాజధాని వార్తలు):** మండలంలో గల తూరు మామిడి గ్రామంలో గృహ నిర్మాణ శాఖ అధికారులు చేపట్టినటువంటి పీఎం ఆవాస్ యోజన సర్వేను రహస్యంగా చేశారని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు ఆరోపిం చారు. తెలుగుదేశం పార్టీకి చెందిన కార్యకర్తలను వెంట పెట్టుకొని వారు చెప్పిన లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఫోటోలు తీశారని. అధికా రుల లేక పార్టీ కార్యకర్తల అని ఆయన విమర్శించారు. గతంలో జగనన్న కాలనీ అభివృద్ధి పనుల్లో పారదర్శకత పాటించకుండా సర్పంచ్ ఆరు లక్షల రూపాయలు బిల్లులు చేసుకున్నారని లోకా యుక్తలు కేసు ఉండగా సర్వేలో వారిని వెంటబెట్టుకోవడం ఏమిటి అని ప్రశ్నించారు. లబ్దిదారులు అధికారులను నేరుగా కలసి తమకు పీఎంకిసాన్ ఫోటోలను తీయాలని కోరితే వెళ్లి తెలుగు దేశం కార్యకర్తలని కలవండి అని అధికారులు బాహాటంగా చెప్పటం గమనార్హం అని ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఇదే పంద కొనసాగితే నిజమైన లబ్ధిదారులను తీసుకొని వెళ్లి ఆందోళనలో చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# పరిసరాల పరిశుభ్రత పట్ల అందరూ అవగాహన కలిగి ఉండాలి

## - ఊబలంకలో జరిగిన స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

**ఊబలంక, (రాజధాని వార్తలు):** చేతుల పరిశుభ్రత పట్ల అందరూ అవగాహన పెంచుకోవాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ఊబలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థులకు పరిసరాలు, చేతుల పరిశుభ్రత పట్ల ఏఎన్ఎమ్ లతో కల్సి అవగాహన కల్పించారు. అనంతరం మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వచ్ఛమైన గాలి, నీరు, పరిసరాలు ఆరోగ్యానికి అండగా నిలుస్తాయని, వ్యాధులు రాకుండా కాపాడుతాయని తెలిపారు. విద్యార్థులందరూ పరిసరాల పరిశుభ్రత పట్ల అవగాహన పెంచుకోవాలని సూచించారు. అలాగే పిల్లలతో స్కూల్ లో పెడతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం గురించి తెలుసుకుని ముచ్చటించారు అనంతరం పిల్లలతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు.

# మోడీ, బీజేపీ, ఎస్సీ వర్గీకరణ పేరుతో దళితుల ఐక్యతపై దేశవ్యాప్త కుట్ర

## - ఇది చరిత్రలోనే అతి పెద్ద రాజకీయ కుట్ర





**భద్రాచలం, (రాజధాని వార్తలు):** మిత్రులారా అసలు ఈ ఎస్సీ వర్గీకరణను శాంపుల్‌గా పంజాబ్ హర్యానాలో మొట్టమొదటిగా ఈ దేశంలో చేసింది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమే, బీజం కాంగ్రెస్ పార్టీ వేస్తే దీన్ని దేశం మొత్తం చేశాడు మన మోడీ సాబ్, దేశంలో అందరికన్నా ముందుగా ఎస్సీ వర్గీకరణ తెలంగాణ రాష్ట్రం చేయడం, దాన్ని కర్ణాటక కాంగ్రెస్ సర్కార్ ఫాలో అవ్వడం, దేనికి నిదర్శనం? రాహుల్ గాంధీకి ఇదంతా తెలిసే జరుగుతా ఉందా? ఎస్సీ వర్గీకరణ అనేది సామాజిక న్యాయం అని డప్పు కొట్టుకునే రేవంత్ రెడ్డి, ఈ యొక్క సామాజిక న్యాయం ఎస్సీలకు రిజర్వేషన్ పేరుతో పడేసే కేవలం ఎంగిలి మెతుకుల్లోనేనా? ఈ దేశ సంపద, ముఖ్యమంత్రి పదవి, మంత్రి పదవులు ఈ దేశ పరిశ్రమలు జడ్జెస్ నియామకాలు, పరిశ్రమల్లో అక్కర్లేదా? రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలి.

నిజానికి ఎస్సీ వర్గీకరణ వల్ల వందలో నలుగురికే బెనిఫిట్ జరుగుతోంది, ఈ వందలో నలుగురికి ఇచ్చే ఈ ఈ ఫలాలను దేశవ్యాప్తంగా ఎస్సీ లిస్టులో ఉన్న 1108 ఎస్సీ కులాలకు ఎలా పంచుతారు మోడీ గారు? అలాగే ఈ నాలుగు సీట్లను తెలుగు రాష్ట్రాల్లో 59 ఎస్సీ కులాలకు చంద్రబాబు, రేవంత్ రెడ్డి ఎలా పంచుతారు? ఇది దళితుల ఐక్యతపై కుట్ర కాదా అని ప్రశ్నిస్తూ ఉన్నాను, చంద్రబాబు మాల సామాజిక వర్గంపై ప్రగతించుకుంటే, తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి మాలలపై తనకు ఏ విధమైన ఈర్ష ద్వేషాలు ఉన్నాయో చేసి చూపించాడు, మాలల హెూల్సేల్ మేనమామ మాలలకు అన్యాయం జరుగుతున్న ముద్దులతో సరిపెట్టేసాడు తప్ప ఈనాటికీ స్పందించలేదు, ఎస్సీ వర్గీకరణ చట్టాలు అయి పోయినవి కదా, ఇక చేసేదేముందని అనుకోకండి మిత్రులారా, ప్రజల తలుచుకుంటే ఏ చట్టాలైన ప్రజాస్వామ్యంలో వెనక్కి తీసుకోవాల్సిందే, తెలుగు రాష్ట్రాల్లో అన్ని రాజకీయ పార్టీలు మాల సామాజిక వర్గాన్ని టార్గెట్ చేసి తొక్కేస్తా ఉంటే మాల ప్రజా ప్రతినిధులు నోరు మెదపకపోవడం, ఘోరం అన్యాయం, చెంచా గిరికి అలవాటు పడ్డ మాల నాయకులు రాజకీయ పార్టీలకు విశ్వాసంగా ఉన్నారే తప్ప జాతి పట్ల విశ్వాసంగా లేరన్న విషయాన్ని ప్రతి ఒక్కరు గమనించాలి, రిజర్వేషన్లు బెనిఫిట్ పొందిన మాల ఉద్యోగులారా మాల జాతిని తొక్కేస్తా ఉన్నారు ఇకనైనా కళ్ళు తెరిచి బయటకు రండి మా ఈ పోరాటానికి మద్దతు ఇవ్వండి, తెలుగు రాష్ట్రాల్లో ఏ నాడు ఎదుర్కొనటువంటి గడ్డ పరిస్థితిని మాల సామాజిక వర్గం ఈరోజు ఎదుర్కొంటూ ఉంది, పూర్తిగా తెలుగు రాష్ట్రంలో మన కులం యొక్క ఉనికిని కోల్పోయాం, శాంతియుత పోరాటానికి సిద్ధం కండి మిత్రులారా

ఈ కార్యక్రమంలో పల్లంటి రమేష్, అల్లాడి పౌల్ రాజు, బొజ్జ వెంకటేశ్వర్లు, చిట్టి రాజారత్నం, బాబు, బండి కళ్ళ రవిబాబు, బత్తుల రమేష్, బిట్ర సాయి బాబు. బల్లెం లక్ష్మణ్, కనపర్తి రాజారావు, నెల్లి సూరిబాబు, కనికెళ్ల నాని తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద సొంతింటి కలపై 'ఇటుక' గుదిబండ

## - ఇందిరమ్మ ఇళ్లకు సిండికేట్ షాక్ - లక్షకు పెరిగిన భారం

## - సామాజిక ఉద్యమకారులు అలవాల రాజా పెరియార్ ఆవేదన



**భద్రాచలం, (రాజధాని వార్తలు):**సొంతిల్లు నెరవేరుతుందని ప్రభుత్వం ప్రకటించిన ఇందిరమ్మ ఇల్లు' పథకం జిల్లా పేదలకు పెనుభారంగా మారింది. గత ఆరు నెలల్లో ఇటుక ధరలు ఆకాశన్నంటడంతో, పేద కుటుంబాలు ప్రభుత్వం ఇచ్చే సహాయంతో ఇల్లు కట్టుకోలేక లబోదిబోమంటున్నారు ఇటుక బట్టీల తయారీ దారులు ఒకే సిండికేట్‌గా ఏర్పడి, కృత్రిమ కొరతను సృష్టించి ధరలను అడ్డూ అదుపు లేకుండా పెంచుతున్నారు. సిండికేట్ కారణంగా జిల్లా మొత్తం ఒకే ధరకు ఇటుక అమ్ముడవుతోంది. ధరలకు గానీ, అక్రమ తయారీదారులపై నియంత్రణకు గానీ స్థానిక మైనింగ్, ఆ శాఖల నుంచి పర్యవేక్షణ కొరవడిందనే విమర్శలు వస్తున్నాయి. పేదల సొంతింటి కలను నెరవేర్చాలన్న ప్రభుత్వ లక్ష్యం ఈ అసాధారణ ధరల పెంపుతో నీరుగారి పోతోంది. ఇందిరమ్మ గృహ లబ్ధిదారులు రాష్ట్ర ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. ధరల నియంత్రణ కమిటీ: ప్రభుత్వం వెంటనే జిల్లా స్థాయిలో ఒక ధరల నియంత్రణ కమిటీని ఏర్పాటు చేసి, ఇటుక ధరలను పాత రేటుకు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని ప్రత్యేక రాయితీ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ఇటుకలను ప్రభుత్వమే సరఫరా చేసి, రాయితీపై అందించే విధంగా ప్రత్యేక కార్యక్రమం ప్రకటించాలి. సిండికెట్‌పై ఉక్కు పాదం: అక్రమంగా సిండికెట్‌గా ఏర్పడి ధరలను పెంచుతున్న తయారీదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఇటుక బట్టీల సిండికేట్ కారణంగా ధరలు పెరిగి, పేదలు ఇల్లు కట్టుకోలేని పరిస్థితి నెలకొంటే, ప్రభుత్వ లక్ష్యం వెనుకబడిపోతుంది. పేదల ఆశలను నిలబెట్టేందుకు, జిల్లా ఉత్పత్తి, ప్రభుత్వం తక్షణమే స్పందించి తక్కువ ధరకు ఇటుకలు లభించేలా చర్యలు తీసుకోవాలని సామాజిక ఉద్యమ కారులు అలవాల రాజా పెరియర్ అధికారులను విజ్ఞప్తి చేశారు.

# కూటమి ప్రభుత్వం క్రెడిట్ చోరీ చేస్తుంది: తెన్నేటి కిషోర్



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి పరిపాలిం చినటువంటి ఐదు సంవత్సరాలలో చేసినటువంటి అభివృద్ధి, సంక్షేమము,పారిశ్రామికరణ, చంద్రబాబు నాయుడు చేస్తున్నట్టుగా చెబుతూ క్రెడిట్ చోరీకి చంద్రబాబు,పాలకవర్గం ప్రయత్నిస్తుందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ స్టేట్ అధికార ప్రతినిధి ప్రచార విభాగం తెన్నేటికిషోర్ అన్నారు విశాఖపట్నంలో డేటా సెంటర్ మేము తీసుకొచ్చామని ప్రచారం చేసుకుంటారు అదేవిధంగా మూడు లక్షల ఇళ్లకు ప్రారంభోత్సవం చేస్తున్నామని ప్రచారం చేసుకుంటారు అవి మేమే కట్టమని ప్రచారం చేసుకుంటారు విశాఖ పట్నంలో జరుగుతున్న సిఐఐ వేదికగా అదానీ పోర్ట్స్ అండ్ ఎస్ ఈ జెడ్ ఎండి కరణ్ అదాని ఇప్పటికే ఇది జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో జరిగినటువంటి ఒప్పందం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఉండగానే ఇక్కడ మేము పెట్టుబడులు పెట్టడానికి వచ్చాం ఇది జగన్మోహన్ రెడ్డి ఆహ్వానం మేరకే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టెందుకు వచ్చామని స్పష్టంగా చెప్పారు అదేవిధంగా అదేవిధంగా ఈ రాష్ట్రంలో 9 లక్షల ఇల్లు కట్టించి ఒకేసారి 7, 43,396 ఇళ్లను ప్రారంభించిన చరిత్ర జగన్మోహన్ రెడ్డి ది ఇప్పటివరకు మీరు అధికారంలోకి వచ్చిన 18 నెలల్లో ఇల్లులేని నిరుపేద కుటుంబాలకు ఒక్క సెంటు స్థలం ఇచ్చిన పరిస్థితి లేదు జగన్మోహన్ రెడ్డి ఇచ్చినటువంటి జగనన్న కాలనీలో నిర్మాణ దశలో ఉన్నటువంటి ఇళ్లకు ఒక్క ఇటుక కానీ ఒక్క ట్రాక్టర్ ఉచిత ఇసుక కానీ ఒక్క సిమెంట్ బస్తాన్ని కానీ ఇచ్చినటువంటి చరిత్ర మీకు లేదు కానీ ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి కట్టినట్టువంటి ఇల్లు అన్నీ కూడా మేమే కట్టామని ప్రచారం చేసుకుంటూ క్రెడిట్ చోరీకి పాల్పట్టం ఎంతవరకు న్యాయమని అడుగుతా ఉన్నా ఈ రాష్ట్రంలో ఈ 18 నెలల పరిపాలనలో మీరు సాధించింది ఏమీ లేదు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా జగన్మోహన్ రెడ్డి సిఎంగా ఉండగా సాధించినటువంటి ప్రతి పరిశ్రమను మేము సాధించామని తండ్రి కొడుకులు ఇద్దరు చెప్పుకోవటం దుర్మార్గమైనటువంటి చర్య ఇది ప్రజల గమనిస్తున్నారు కచ్చితంగా రాబోయే రోజుల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్తారని తెన్నేటి కిషోర్ అన్నారు. ఈ కార్యక్రమంలో సీని యర్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మట్టా ఏడుకొండల చింతా శ్రీనివాస్ మట్ట మత్తయ్య ఉప్పటి రాజేష్ పాల్గొన్నారు.

# గంటాను మర్యాదపూర్వకంగా కలిసిన గాడు సన్యాసినాయుడు



**భీమునిపట్నం, (రాజధాని వార్తలు):** తెలుగుదేశంపార్టీ సీనియర్ నాయకులు, ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాగవంశం వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన గాడు సన్యాసి నాయుడు నియోజకవర్గం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. గత 40 ఏళ్లుగా తెలుగుదేశం పార్టీలో విశిష్ట సేవలు అందించిన తనకు ఎమ్మెల్యే గంటా చొరవతో నాగవంశం వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నామినేటెడ్ పదవిని ప్రకటించడం చాలా ఆనందంగా ఉందని అందుకు కారకులైన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు రుణపడి ఉంటానని అన్నారు. ఈ సందర్భంగా గంటా కు సన్యాసి నాయుడు ప్రత్యేక ధన్యవాదములు తెలియచేసారు. అలానే ఇంతటి బాధ్యతను స్వీకరించడానికి సహకరించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాగవంశం సంక్షేమ సంఘం అధ్యక్షులు గాడు అప్పలనాయుడుకు నా యొక్క ప్రత్యేకమైన ధన్యవాదాలు మరియు కృతజ్ఞతలు తెలియజేస్తు న్నాను అన్నారు.

# ఘనంగా శ్రీ అయ్యప్పస్వామి ఆలయం జీర్ణోద్ధరణ, కళాపకర్షణ కార్యక్రమాలు

**భీమునిపట్నం, (రాజధాని వార్తలు):** శ్రీశ్రీశ్రీ అయ్యప్పస్వామి ట్రస్ట్ సభ్యులు మరియు భగవత్ భక్తుల సహాయ సహకారాలతో శనివారం శ్రీ అయ్యప్పస్వామి ఆలయం జీర్ణోద్ధరణ, కళాపకర్షణ కార్యక్రమాలు ఘనంగా పూర్తయ్యాయని ట్రస్ట్ అధ్యక్షుడు సుస రాపు మాధవశాస్త్రి (మధు పంతులు) తెలిపారు. ఈ సందర్భంగా మధు పంతులు మాట్లాడుతూ ఇందులో భాగంగా విఘ్నేశ్వర పూజ, భగవత్ పుణ్యవచనం, పరిషత్ ప్రాయశ్చిత్తం, రక్షా సూత్రధారణ, సర్వతో భద్ర మండల ఆరాధన, వాస్తు మండప ఆరాధన, హెూమాలు, వాస్తు బలిహరణ, అయ్యప్ప స్వామికి గోమాతతో జీర్ణోద్ధరణ ఇత్యాది కార్యక్రమాలు నిర్వహించామని ఆయన చెప్పారు. భీమిలి శ్రీ అయ్యప్ప స్వామి ఆలయం పునర్నిర్మాణ పనులు వెంటనే ప్రారంభమవుతాయని, పుర పెద్దలు, భగవత్ భక్తులు మరియు దాతల సహకారంతో వీలైనంత త్వరగా ఆలయ పునర్నిర్మాణం పూర్తి చేయడం జరుగుతుందని ఆయన అన్నారు భక్తులు, దాతలు వస్తు రూపేణా, ధన రూపేణా ఆలయ నిర్మాణానికి సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కదిరి జగన్నాథం, ప్రధాన కార్యదర్శి ముసునూరి సూర్య శ్రీనివాస్, కోశాధికారి మొకర నర్సింగరావు, సమన్వయకర్త గుగ్గిళ్ళ సాయి, శ్రీ వీరాంజనేయ అయ్యప్ప స్వామి సేవా సంఘం అధ్యక్షుడు కె ఎర్రినాయుడు మరియు భక్తులు పెద్దఎత్తున



పాల్గొన్నారు.

# యాపిల్ డయాగ్నోస్టిక్ సెంటర్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు





**కొత్తపేట నియోజకవర్గం, (రాజధాని వార్తలు):** రావులపాలెంలో బలరామిరెడ్డి ఆసుపత్రి సమీపంలో కుసుమే రమేష్ సారథ్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన యాపిల్ డయాగ్నోస్టిక్ సెంటర్ ను ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఆకుల రామకృష్ణ శనివారం ప్రారంభించారు. సరైన డయాగ్నోసిస్ ద్వారా వ్యాధులను అంచనా వేస్తే నివారణ సాధ్యమవుతుందని అందుకోసం ఆధునిక పరికరాలతో కూడిన డయాగ్నోస్టిక్ సెంటర్ల అవసరం ఉందని ఎమ్మెల్యే అన్నారు.

# పరిశుభ్రతపై అవగాహన సదస్సు



**డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం, (రాజధాని వార్తలు):** ప్రతీ వ్యక్తి తన వ్యక్తిగత పరిశుభ్రత పాటించటం ద్వారా కేవలం తన ఆరోగ్యాన్ని మాత్రమే కాకుండా సమాజ ఆరోగ్యాన్ని కూడా రక్షించుకోగలుగుతాడని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ పిలుపునిచ్చారు. మూడో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాల్లో భాగంగా స్థానిక గాంధీ మున్సిపల్ హై స్కూల్ నందు సమాజ వ్యక్తిగత పరిశుభ్రత ఇతివృత్తంగా పిల్లల చేత పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించి అనంతరం పరిశుభ్రతపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతులు తరచూ సబ్బుతో కడు క్కోవడం, స్నానం చేయడం, దంతాలు పరిశుభ్రం చేసు కోవడం, శుభ్రంగా బట్టలు ధరించడం వంటి సరైన అలవాట్లతో అనేక అంటు వ్యాధుల వ్యాప్తి నుండి రక్షణ పొందవచ్చునని హి తవు పలికారు. వ్యక్తిగత అనుకూలత మాత్రమే కాక, భాగస్వామ్య నివాస ప్రాంతాల్లో ఉన్నవారితో బాధ్యతాయుతమైన సంబంధాలను అన్ని విధాల ప్రోత్సహిస్తుందన్నారు. ఈ పరిశుభ్రత శుభ్రమయిన శరీరంతో సమాజం ఆరోగ్యంగా, ఉల్లాసంగా ఉంటుందన్నారు. పర్యా వరణ శుభ్రతతో పాటుగా వ్యక్తిగత పరిశుభ్రతను కూడా పాటించడం అత్యవసరమన్నారు. అనారోగ్యాలు, సంక్రమణ వ్యాధులు మరియు ఇతర ఆరోగ్య సమస్యలను నియంత్రిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆయన పరిశుభ్రత అంశాలపై విద్యార్థులను ప్రశ్నించి సమాధానాలు రాబట్టారు ప్రజలందరూ వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టి, సక్రమమైన పరిశుభ్రత అలవాట్లు పాటించడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మిద్దామన్నారు. ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా తమ పరిశుభ్ర తకు శ్రద్ధ పెట్టి, చేతులు తరచుగా కడుగు, శరీరం, దంతాలు, వివిధ భాగాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నా రు. ఈ పరిశుభ్రత మరియు పర్యావరణ చర్యలు మన ఆరోగ్యాన్ని, సమాజ ఆరోగ్యాన్ని భద్రపరుస్తాయన్నారు ఇవి పాటించడం ద్వారా మనం ఆరోగ్యకరమైన, సంతోషకరమైన సమాజాన్ని కాపాడుకునే బాధ్యతను ఆచరించగలుగుతామన్నారు వ్యక్తిగత పరిశుభ్రత అవసరాలు, ప్రయోజనాలు, మరియు సమాజ ఆరోగ్యానికి సంబంధించిన అంశాల పట్ల, ప్రజల్లో అవగాహన మరింతగా పెంచుతూ చివరిగా విద్యార్థినీ విద్యార్థులతో జిల్లా కలెక్టర్ స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు ఈ కార్యక్ర మంలో జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ సలీం బాషా ప్రధానోపాధ్యాయులు గణ సత్యనారాయణ మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
## 9440662699, rajadhanivartalu.com

### EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

### HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యంఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

### MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

### REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

### NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ టి.రమేష్, మంగళగిరి 0863-999999

### RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

### COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎక్ట్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి ప్రాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# రఘునాథపాలెం పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన అడిషనల్ డీసీపీ లా & ఆర్డర్



**ఖమ్మం, (రాజధాని వార్తలు):** రఘునాథపాలెం పోలీస్ స్టేషన్‌ను అడిషనల్ డీసీపీ లా & ఆర్డర్ ప్రసాద్‌రావు సందర్శించారు. సోమవారం పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న అడిషనల్ డీసీపీ స్టేషన్ నిర్వహణ, పోలీసుల పనితీరు, సెక్టార్ అధికారుల విచారణ నివేదికలు,. సి.సి.ఎన్.ఎస్ అప్లోడ్, జనరల్ డైరీ రికార్డులను పరిసరాలను పరిశీలించారు. పిటిషన్ విచారణలకు సంబంధించి సిబ్బందితో మాట్లాడారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదు అయిన కేసులు, డయల్ 100 కాల్స్ ప్రతిస్పందన సమయం, సస్పెక్ట్ షీట్‌లు, పెండింగ్ కేసులు పరిశీలించారు. స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ.. వాహనాల తనిఖీలు ముమ్మరం చేయాలని అన్నారు. స్టేషన్ హౌస్ మేనేజ్‌మెంట్, పోలీస్ స్టేషన్ నిర్వహణ, సెక్టార్ ఆఫీసర్ల భాధ్యతలు విధిగా అమలు చేయాలని సూచించారు. పెట్రో కార్, బీట్ డ్యూటీ సిబ్బంది ఏవిధమైన విధులు నిర్వహిస్తున్నారు? పాత నేరస్థుల నివాసాలను కదలికలను ఏవిధంగా గుర్తిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వివిధ కేసుల్లోని వాహనాలను పరిశీంచారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఏసీపీ రమణమూర్తి పాల్గొన్నారు.

# కార్మిక వర్గాన్ని అణచి వేయాలని చూస్తే చరిత్రలో చూడని ఉద్యమాలను చూస్తారు




**తిరుపతి, (రాజధాని వార్తలు):** కార్మిక వర్గాన్ని యాజమాన్యాలకు కట్టు బానిసలుగా మార్చేందుకు తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లు అమలులోకి తీసుకొని రావద్దని కార్మిక సంఘాలు కోరుతుంటే రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మేడే ద్వారా సాధించుకున్న రోజుకి 8 గంటల పనిని ఓటితో కలిపి 12 గంటల పని దినంగా పెంచు తూ చట్టం తీసుకు రావడం దుర్మార్గమని, కార్మిక వర్గాన్ని అణచి వేయాలని ప్రయత్నిస్తే చరిత్రలోనే కనివిని ఎరుగని ఉద్యమాలను చూడాల్సి వస్తుందని ఐఎఫ్టీయూ నేతలు స్పష్టం చేశారు. 12 గంటల పని విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఐఎఫ్టియు ఆధ్వర్యంలో కార్మికులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు అనంతరం తమ డిమాండ్‌తో కూడిన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్కు అందజేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్టియు తిరుపతి జిల్లా కోశాధికారి కుడుం విజయ్ కుమార్ మాట్లాడుతూ 12 గంటల పని విధానానిక సంబంధించిన సవరణల బిల్లును 2025 సెప్టెంబర్ 19న అసెంబ్లీలో ఆమోదించి, చట్ట సవరణ చేస్తూ నవంబర్ 3న జీవో నెంబర్ 23 విడుదల చేసిందన్నారు. పని గంటలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన జీవో నెంబర్ 23ను రద్దు చేయాలని, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులతో పాటు ఆప్కాస్‌లో ఉన్న కార్మికుల, ఉద్యోగులందరిని రెగ్యులరైజ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆటో మోటార్, హమాలీ రంగాలకు సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలని, కార్పొరేట్లకు, వివిధ సంస్థలకు విచ్చల విడిగా ఉచితంగా భూములను, రాయి తీలను కట్టబెట్టే విధానాలను నిలిపి వేయాలని కోరారు. గూగుల్ డేటా వంటి పర్యావరణ వ్యతిరేక విధ్వంసకర పరిశ్రమలకు అనుమతులు నిరాకరించాలన్నారు. అంగన్వాడీ జిల్లా నాయకురాలు గంగాదేవి మాట్లాడుతూ అంగన్వాడీ, ఆశ వంటి స్కీమ్ రంగాల వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కార్మికుల కనీస వేతనం 26 వేల రూపాయలకు తక్కువ కాకుండా ప్రకటించాలన్నారు. బిఓసి బోర్డు పథకాలను అమలు చేయాలని, ప్రభుత్వం వాడుకున్న నిధులను బోర్డుకు జమ చేయాలన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని తొలగించిన కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, నిర్వా సితులకు పర్మినెంట్ ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ తిరుపతి నగర కమిటి అధ్యక్షురాలు సుజాత,నాయకురాలు శశికళ, ఆటో యూనియన్ నాయకులు మల్లి రవి, శీను, హుస్సేన్, బాబు, వేమయ్య, అభిరామ్, ఉదయ్, చిరం జీవి, బాలకృష్ణ, మోహిత్, రాఘవేంద్ర, రాములు, వెంకటేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

# టీఎంవీ కండ్రిగలో ఈ-క్రాప్ నమోదుపై అవగాహన





**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** శ్రీకాళహస్తి రూరల్ మండలంలోని టీఎంవీ కండ్రిగ రైతు సేవా కేంద్రంలో ఈ-క్రాప్ నమోదు గురించి అవగాహన కార్యక్రమం గ్రామ అగ్రికల్చర్ అసిస్టెంట్ ఎం.భాస్కర్ నాయక్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్ నాయక్ మాట్లాడుతూ ఈ క్రాప్ నమోదు వల్ల ప్రభుత్వం ఇచ్చే రాయితీలు, బ్యాంకు రుణాలు, రైతు గిట్టుబాటు ధర మరియు ధాన్యం కొనుగోలు సమయంలో ఉపయోగపడుతుంది అని, పై తెలిపిన గ్రామాల రైతులు పేర్లు రైతు సేవా కేంద్రంలో నోటీసు బోర్డును ప్రదర్శించామని తెలిపారు. అందులో ఏదేని పేర్లు, విస్తీర్ణం, ఆధార్ నెంబర్ వంటి తప్పిదాలు ఉంటే వచ్చే నెల 17 వరకు అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ దోరయ్ రాజ్ రెడ్డి, మాజీ సర్పంచ్ సోయిండి. ఈశ్వర్ రెడ్డి, పెనుబాకు కృష్ణమనయుడు, ముని శంకర్ రెడ్డి, లీలయ్య, పానగల్, పెనుబాక, అరవకోత్తూరు, టీఎంవీ కండ్రిగ, చుక్కల నిడిగల్లు గ్రామ రైతులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థుల విద్యను బూడిద పాలు చేస్తున్న కూటమి ప్రభుత్వం



**పెళ్లకూరు, (రాజధాని వార్తలు):** పేద ప్రజలకు వైద్య విద్యను అభ్యసించి, వైద్య సేవలు అందించాలనుకుంటున్న పేద విద్యార్థుల స్వప్నాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పేద విద్యార్థులను బూడిదపలు చేస్తోంది అని కళాకారుల అధ్యక్షులు అట్ల కృష్ణయ్య అన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరించేందుకు కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై వైయస్ఆర్సీపీ అధినేత వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజా ఉద్యమానికి పిలుపునిచ్చారు. సూళ్లూరు పేట నియోజకవర్గ వైసీపీ ఇంచార్జ్ కిలివేటి సంజీవయ్య, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి ఆదేశాలు మేరకు, మండల కన్వినర్ ఒబ్బు వెంకటరత్నం సూచనల మేరకు పునబాక గ్రామపంచాయతీలో కళాకారుల అధ్యక్షులు అట్ల కృష్ణయ్య ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ ప్రారంభించారు. గ్రామంలోని యువతకు వివరిస్తూ సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా కిష్టయ్య మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పరిపాలన మోసపూరి తంగా సాగుతుందన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు పంగనామాలు పెట్టారని ఆరోపించారు. గతంలో అప్పటి ముఖ్య మంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రత్యేకంగా కేంద్రంతో పోరాడి 17 మెడికల్ కళాశాలను తీసుకు వస్తే, వాటిని కుట్ర పూర్వకంగా ప్రవేట్ వ్యక్తులకు అప్పగించేందుకు పన్నాగం పడుతున్నారని విమర్శిం చారు. పేద విద్యార్థులను వైద్య విద్యకు దూరం చేసేందుకు తెగ బడుతున్నారని మండిపడ్డారు. వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి గతంలో విద్య వ్యవస్థలు అనేక మార్పులు తీసుకొచ్చారన్నారు. ఫీజు రీయింబర్స్మెంట్, నాడు నేడుతో పాఠశాల రూపురేఖలు మార్చారని తెలిపారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan